Follow: @ANNTELUGU
10-03-2026
# మహా పత్రిక
ANN తెలుగు
మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 72 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ఖమ్మంలో కవిత నిరవధిక నిరాహార దీక్ష

### తెలంగాణ జాగృతి చీఫ్ సంచలనం

బాధితులతో కలిసి మండుటెండలో రోడ్డుపై ఆందోళన.. అరెస్ట్
వెలుగుమట్ల బాధితులకు కూల్చిన చోట
ఇళ్ళుఇచ్చేదాకా తగ్గేదేలే ఎవన్ఎన్ తో కవిత

**ఖమ్మం, మహా :** ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులకు అండగా ఉంటానని చెప్పిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత.. వారితో కలిసి నిరవధిక నిరాహార దీక్షకు దిగారు. ఖమ్మంలోని అంబేద్కర్ భవన్‌లో ఆమె దీక్షకు కూర్చున్నారు. వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలని కవిత డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. భూదాన్ భూముల బాధితులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేద్దామని ఆమె పిలుపునిచ్చారు. సోమవారం మధ్యాహ్నం బాధితులతో కలిసి జడ్పీ కూడలిలో కవిత ఆందోళనకు దిగిన సంగతి తెలిసిందే. ఆమె రోడ్డుపై బైఠాయించడంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. పోలీసులు కలగజేసుకొని ఆమెను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మిగతా 2లో

టాప్ న్యూస్



### ఇరాన్‌కు రష్యా సంపూర్ణ మద్దతు

- పుతిన్ ప్రకటన
- నూతన సుప్రీం ముజ్తబాకు అభినందనలు

02

### బెంగుళూరులో హోటళ్ళు బంద్

CLOSED

- యుద్ధం ఆగేదాకా ఇంతే
- దేశంలోని ఇతర నగరాల్లోనూ ఇదే సీన్

02



### మూసీ పునరుద్ధరణను వ్యతిరేకించడమంటే..

- రాష్ట్రానికి అన్యాయం చేయడమే
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

02



### తెలంగాణలో సారా దుకాణాలను తెరవాలి

- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి
- సారాను ఎందుకు నిషేధించారో ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలి
- మధ్యప్రదేశ్, ఒడిశా తరహాలో నడపాలి

02



మహా పత్రిక మహా రాణి 04

సూపర్ రిచ్ మహిళా ఎమ్మెల్యేలు

దేశంలో 14 మంది మహిళా ప్రజాప్రతినిధులు బిలియనీర్లు
అత్యంత సంపన్నుల జాబితాలో తొలి మూడు స్థానాలు ఏపీ ఎమ్మెల్యేలవే
రూ.716 కోట్ల ఆస్తులతో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి దేశంలో నెంబర్1
నెంబర్ 2గా కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి రెడ్డి – రూ.388 కోట్లు
తెలంగాణ నుండి యశస్విని, పద్మావతి ఉత్తమ్ టాప్

వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి – రూ.716 కోట్లు

ప్రత్యేక కథనం 4లో



# పునర్విభజన టెన్షన్

## జమిలికి జై కొట్టేలా ప్లానింగ్

### ఢిల్లీలో నేతల చర్చోపచర్చలు

జనగణన పూర్తికాగానే.. పునర్విభజన సందడే
ఏ నియోజకవర్గం ఎటు వెళ్ళొచ్చు.. ఎలా మారొచ్చు
153 నుండి 175వరకు తెలంగాణ సీట్లు పెరిగే అవకాశం
గ్రేటర్ లో భారీగా పెరగనున్న నియోజకవర్గాలు

(హైదరాబాద్ -మహా)

జనగణన ప్రక్రియ ప్రారంభమవడంతో.. ఎంతోకాలంగా చర్చలో ఉన్న నియోజకవర్గాల పునర్విభజన ఖాయమైపోయింది. 2029లోనే కొత్త నియోజకవర్గాల్లో ఎన్నికలు జరుగుతాయని, జమిలి ఖాయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు సందర్భాల్లో ప్రకటించారు. మే నుండి జనగణన ప్రారంభం కానుండగా, వచ్చే ఏడాది పునర్విభజన ప్రక్రియ మొదలవుతుందని విశ్లేషణలున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాలకు హాజరైన ఎంపీలు.. దీనికి సంబంధించిన డ్రాఫ్ట్ లేమైనా తయారయ్యాయా? ప్రతిపాదనలున్నాయా? అని ఆరాతీయడం మొదలుపెట్టారు. ఈ నియోజకవర్గాల పునర్విభజనతో ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలతో పాటు ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల స్థానాలు పెరుగనున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ అసెంబ్లీ స్థానాలు 153కు పెరిగితే మహిళలకు 33% రిజర్వేషన్ల ప్రకారం.. 51 సీట్లు లభిస్తాయి. 175కు చేరితే మహిళా రిజర్వుడు స్థానాలు 58 సీట్లకు పెరిగే అవకాశం ఉంది. అందులోనూ ఎస్సీ, ఎస్టీ మహిళా రిజర్వేషన్లు అమలు కానుండటంతో రిజర్వేషన్ల స్థానాల సంఖ్య పెరుగనుంది. ఈ మేరకు చట్ట సభలలో ఆయా వర్గాల ప్రాతినిధ్యం పెరుగనుంది.

**జమిలి పక్కా...**

జమిలి ఎన్నికలు ఖాయమని, రాష్ట్రాల బలం క్షీణిస్తుందని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ సహా పలు ప్రాంతీయపార్టీల అధినేతలు అంటున్నారు. కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికలకు సిద్ధమవుతున్నదన్న సంకేతాలున్నాయి. మిగతా 2లో

### గ్రేటర్ లో భారీగా పెరగనున్న సీట్లు

గ్రేటర్ హైదరాబాద్ లో ఎమ్మెల్యే సీట్లు భారీగా పెరగనున్నాయి. ప్రస్తుతం 24 ఎమ్మెల్యే సీట్లు ఉండగా, తాజా విలీనాలు, పునర్విభజనలతో ఒక్క గ్రేటర్ లోనే 40 నుండి 50 అసెంబ్లీ స్థానాలు ఏర్పడనున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. దీంతో ఎవరి అంచనాలు.. లెక్కల్లో వారున్నారు. సేఫెస్ట్ నియోజకవర్గాల కోసం నేతలు పనిచేస్తున్నారు.

## ఎంపీ వేం నరేందర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక..

### నియామకపత్రం అందించిన అధికారులు

అభిషేక్ సింఘ్వీ, తెలంగాణ నుండి రెండోసారి
తెలంగాణ సమస్యలను ఢిల్లీలో వినిపిస్తా: వేం నరేందర్‌రెడ్డి



**హైదరాబాద్, మహా:** తెలంగాణ ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితుడైన వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ సభ్యుడయ్యారు. ఒకటిన్నర దశాబ్దం తర్వాత పదవి దక్కడంతో ఎంపీ సాబ్ అంటూ అభిమానులు, అనుచరులు ఆనందోత్సాహాన్ని చాటారు. తెలంగాణ నుంచి రాజ్యసభకు అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియగానే ఇద్దరు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అసెంబ్లీ ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ మేరకు రాజ్యసభ సభ్యులుగా సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి నియామకపత్రం అందుకున్నారు. రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించిన ఏఐసీసీ పెద్దలు ఖర్గే, రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డికి నరేందర్ రెడ్డి ధన్యావాదాలు తెలిపారు. తాను ఎంపీ కావడానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ నేతలందరికీ కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

**తెలంగాణ సమస్యలను ఢిల్లీలో వినిపిస్తా: వేం నరేందర్**

తెలంగాణ సమస్యలను రాజ్యసభలో, ఢిల్లీలో వినిపిస్తానని పేర్కొన్నారు. వాటిని పరిష్కరించే విధంగా కేంద్రంపై ఒత్తిడి తెస్తానని తెలిపారు. తాను మొదటి నుండీ వివాదాలకు దూరంగా ఉంటానని, పార్టీనే తన మొదటిప్రాధాన్యమని, పార్టీ ఏం ఆదేశిస్తే అదే పనిచేస్తానన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే అనుభవం గల సభ్యులు రాజ్యసభలో అడుగుపెడుతున్నారని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

### రెండోసారి ఎంపీగా సింఘ్వీ..

అభిషేక్ మను సింఘ్వీ దేశంలో అత్యంత సీనియర్ న్యాయవాదుల్లో ఒకరు. ఏఐసీసీ కోటా కింద తెలంగాణ నుంచి మరొకసారి ఆయనకు కాంగ్రెస్ అవకాశం కల్పించింది. వేం నరేందర్ రెడ్డితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. దీంతో నరేందర్ రెడ్డికి రాజ్యసభ ఎంపీ పదవి రావడానికి ముఖ్యమంత్రే ప్రధాన కారణమన్న చర్చ సర్వత్రా ఉంది.



# పునర్విభజన టెన్షన్

(మొదటిపేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో తెలంగాణలో పార్లమెంట్ , అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరిగే అవకాశం ఉండటం.. రాష్ట్ర రాజకీయ ముఖ చిత్రాన్నిపూర్తిగా మార్చనుంది. దేశ వ్యాప్తంగా చేపట్టనున్న జన గణన ప్రక్రియను వచ్చే పార్లమెంటు ఎన్నికల్లోగానే పూర్తి చేసి, నియోజక వర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేస్తామని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఇటీవల కీలక వ్యాఖ్యలు చేశారు. జనగణన తర్వాత తెలంగాణలో నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం చేపడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఇప్పటికే చట్టం చేయడంతో వచ్చే ఎన్నికల్లో దీనిని అమలు చేయనున్నట్లుగా సంకేతాలిస్తూ.. తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికలు పార్లమెంటు ఎన్నికలతోనే కలిసి నిర్వహిస్తారని లక్ష్మణ్ వెల్లడించారు. దీంతో తెలంగాణలో నియోజకవర్గాల సంఖ్య పెరుగడం పక్కా అని తేలిపోయింది. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నేరుగా బహిరంగసభల్లోనే ఈ విషయం చెబుతున్నారు.

### 34కు పైనే పెరగనున్న ఎమ్మెల్యేల స్థానాలు

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని నిబంధనల మేరకు నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియతో తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న అసెంబ్లీ స్థానాలు 119 నుండి కనీసం 153కు, పార్లమెంట్ స్థానాలు 17 నుండి 23-25 మధ్య పెరిగే అవకాశం ఉంది. దీని ప్రకారం చూస్తే.. కొత్తగా 34 అసెంబ్లీ స్థానాలు రానున్నాయి. అయితే జనాభా పెరుగుదల ప్రాతిపదికన ఈ సంఖ్య 161 నుండి 175 వరకు కూడా వెళ్లే అవకాశం లేకపోలేదన్న అంచనాలు వినిపిస్తున్నాయి.



మరో ఆరు ఎంపీ స్థానాలు

ప్రస్తుతం రాష్ట్రంలో 17 లోక్‌సభ స్థానాలున్నాయి. ప్రస్తుత విధానంలో 19 లక్షల జనాభాకు ఒక ఎంపీ స్థానం ఉంది. డీలిమిటేషన్ తర్వాత ఈ సంఖ్య 23 నుండి 25 వరకూ పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఒక్కో లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ప్రస్తుతం ఉన్న ఏడు అసెంబ్లీ స్థానాల సంఖ్యను 8 నుంచి 9 స్థానాలకు పెంచితే అసెంబ్లీ సెగ్మెట్ల సంఖ్య 175కు పెరుగవచ్చంటున్నారు. అప్పుడు ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్న 153 అసెంబ్లీ స్థానాల సంఖ్యను మార్చాల్సి ఉంటుంది. అందుకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరణ చట్టంలో మార్పు చేయాల్సి ఉంటుంది. జిల్లాల పునర్విభజన తర్వాత ఒక్కో పార్లమెంటు నియోజకవర్గం నాలుగైదు జిల్లాలకు, అసెంబ్లీ నియోజకర్గాలు కూడా రెండు మూడు జిల్లాలకు విస్తరించాయి. ఈ అంశాలను పరిగణలోకి తీసుకుని నియోజకవర్గాల పునర్విభజన కసరత్తు చేయనున్నారు. పార్లమెంటు నియోజవకర్గాల డిలిమిటేషన్ ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని ప్రస్తుతం ఉన్న జనాభా నే పరిగణనలోకి తీసుకుని రాష్ట్రం యూనిట్ గా జరగవచ్చు. ఇక తెలంగాణలో కనీసం 6 ఎంపీ స్థానాలు పెరగనున్నాయి.

### మహిళలు.. మీరే మహారాణులు

నియోజకవర్గాల పునర్విభజనతో పెరుగనున్న ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలతో పాటు ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల స్థానాలు పెరుగనున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ అసెంబ్లీ స్థానాలు 153కు పెరిగితే మహిళలకు 33% రిజర్వేషన్ల ప్రకారం.. 51 సీట్లు లభిస్తాయి. 175కు చేరితే మహిళా రిజర్వుడు స్థానాలు 59 సీట్లకు పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో నియోజకవర్గాల్లో ఎక్కడ మార్పులు జరగొచ్చు, ఎక్కడ రిజర్వేషన్లు మారొచ్చు అన్న అంచనాలో నేతలున్నారు. డీలిమిటేషన్ కారణంగా పెరుగనున్న లోక్‌సభ సీట్లు, అసెంబ్లీ సెగ్మెంట్ లకు అనుగుణంగా అభ్యర్థులను రెడీ చేసుకునే క్రమంలో ప్రస్తుతం రాజకీయాల్లో ఉన్న నాయకుల కుటుంబాలకు చెందిన వారసులు,, డబ్బున్న నేతలే అధికంగా బరిలోకి దిగే అవకాశాలున్నాయి. తాజాగా ఏడీఆర్ ప్రకటించిన నివేదికలో మహిళానేతల్లో అత్యధిక సంపన్నులు తెలుగురాష్ట్రాల్లోనే ఉన్నారని పేర్కొన్నారు. గతం కంటే 2023లో తెలంగాణలో మహిళా ప్రాతినిధ్యం పెరిగింది. ఇటీవల మునిసిపల్ ఎన్నికల్లో రిజర్వేషన్లకు మించి మహిళా ప్రజాప్రతినిధులు ఛైర్ పర్సన్ లు కావడం భవిష్యత్ రాజకీయాలకు దిక్సూచిగా కనబడుతోంది.

## ఒలింపిక్స్ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తాం

- యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీకి అంతర్జాతీయ ప్రమాణాలు కల్పించాలి
- నగరంలోని స్టేడియాలను ఆధునీకరించాలి
- క్రీడలపై సమీక్షలో సీఎం సీఎం రేవంత్

**హైదరాబాద్, మహా :** యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీకి అంతర్జాతీయ ప్రమాణాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఒలింపిక్స్, కామన్ వెల్త్ కోసం తెలంగాణ క్రీడాకారులకు పూర్తి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. క్రీడాశాఖపై సచివాలయంలో సోమవారం మంత్రులు, అధికారులతో సమీక్షించిన సీఎం పలు కీలక అంశాలపై చర్చించారు. ప్రధానంగా అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో సౌకర్యాల కల్పన, అన్ని రకాల క్రీడలకు మైదానాల ఏర్పాటుపై చర్చించారు. ఒలింపిక్స్ టార్గెట్ గా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు వీలుగా తెలంగాణలో అన్ని సౌకర్యాలతో పాటు స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మాణాలు ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. గచ్చిబౌలి అవుట్ డోర్ స్టేడియాన్ని పునరుద్ధరించడంతోపాటు, స్టేడియం ఆవరణలో ఇండోర్ స్టేడియం, యూనివర్సిటీ కాంప్లెక్స్, హాస్టల్ భవనాలు, అన్ని రకాల క్రీడా మైదానాలు, శిక్షణకు అవసరమైన ఇతర సౌకర్యాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ నిర్మాణాలకు సంబంధించి పలు డిజైన్లను పరిశీలించారు. ఈ డిజైన్లకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు.

### ప్రణాళికలు సిద్ధం చేయాలి

ఒలింపిక్స్, కామన్ వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా అధికారులు కార్యాచరణ రూపొందించాలని సీఎం ఆదేశించారు. ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారుల సత్తా చాటడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని మార్గనిర్దేశం చేశారు. నగరంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం, ఎల్బీ స్టేడియం, సరూర్ నగర్ స్టేడియాలను భవిష్యత్ అవసరాలు, శిక్షణ, పోటీలకు అనుగుణంగా ఆధునీకరించాలని సీఎం ఆదేశించారు. ఈ సమావేశానికి మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, స్పాట్ ఛైర్మన్ శివసేనా రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు శ్రీనివాస రాజు, శేషాద్రి, స్పాట్ ఎండీ సోనీ బాలదేవి, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ జి. కిషోర్, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ఖమ్మంలో కవిత నిరవధిక నిరాహార దీక్ష

(మొదటిపేజీ తరువాయి)

చీకటి పడటంతో కవితను పోలీస్‌స్టేషన్ నుంచి పోలీసులు పంపించేశారు. స్టేషన్ నుంచి నేరుగా అంబేద్కర్ భవన్‌కు చేరుకున్న కవిత దీక్షకు దిగారు. ఇళ్లు కూల్చిన చోటే వెలుగుమట్ల బాధితులకు ప్లాట్లు ఇచ్చి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే వరకు నిరవధిక నిరాహార దీక్ష కొనసాగిస్తానని ఆమె తెలిపారు. ఆందోళనల్లో పాల్గొని బాధితుల పక్షాన తగ్గేదెలే అంటూ కవిత ధైర్యంగా నిలిచారు. ఓ వైపు పోలీసుల అరెస్ట్ లు, తోపులాటల నడుమ కవిత ఏఎన్ఎన్ తో మాట్లాడుతూ బాధితులకు న్యాయం జరిగే వరకు కదిలేదిలేదని, అరెస్ట్ లకు భయపడమన్నారు.

## మూసీ పునరుద్ధరణను వ్యతిరేకించడమంటే రాష్ట్రానికి అన్యాయం చేయడమే

సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, మహా :** నల్ల చెరువు అభివృద్ధి చూస్తే ఆనందంగా ఉందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైడ్రా పునరుద్ధరించిన కూకట్‌పల్లి నల్ల చెరువును ప్రారంభించి ఆయన మాట్లాడారు. “సీఎంగా మీ ముందుకు రావడం ఆనందంగా ఉంది. ఆనాడు ఎంపీగా కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని ఉన్నా నిధులు లేక చేయలేకపోయా. ఇప్పుడు అభివృద్ధికి ఎన్ని నిధులైనా ఇస్తాను. చెరువుల పునరుద్ధరణ వల్ల పేదలకు నష్టం కలిగి ఉండవచ్చు. నిర్వాసితుల్లో అర్హులైన పేదలు ఉంటే వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తాం. పేదవాడి ఇల్లు కూల్చడం ప్రభుత్వ ఉద్దేశం కాదు. వరదల వల్ల ఇళ్లు మునిగిపోతే కుటుంబం మొత్తం నష్టపోతుంది. వరద ముప్పును తప్పించాలంటే చెరువులను పునరుద్ధరించాలి. మూసీని పునరుద్ధరించకుంటే భవిష్యత్ తరాలు మనల్ని క్షమించవు. భాజపా ప్రభుత్వాలు గంగా, సబర్మతి, సరయూ నదుల అభివృద్ధిని చేపట్టలేదా? మూసీ అభివృద్ధిని మాత్రం ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? మూసీ పునరుద్ధరణను వ్యతిరేకించడమంటే రాష్ట్రానికి అన్యాయం చేయడమే. ఎవరికైనా నష్టం జరిగితే మంచి పరిహారం ఇచ్చి ఆదుకుంటాం” అని రేవంత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ నరేందర్ రెడ్డి పిఏసి ఛైర్మన్ గాంధీ, ఎమ్మెల్యేలు మాధవరం క్రిష్ణారావు, రామచంద్రనాయక్, హైడ్రా చీఫ్ రంగనాథ్ పాల్గొన్నారు.

## జమిలి ఎన్నికల వల్ల రాష్ట్ర ఎన్నికల ప్రాధాన్యత తగ్గుతుంది

తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్

**మహా:** వన్ నేషన్ వన్ ఎలక్షన్ జమిలి ఎన్నికల వల్ల రాష్ట్ర ఎన్నికల ప్రాధాన్యత తగ్గిపోతుందని, కేంద్ర ప్రభుత్వం చేతుల్లోకి అధికారాలన్నీ వెళతాయని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మండిపడ్డారు. జమిలి ఎన్నికల విధానంపై ఆయన స్పందిస్తూ, ఈ విధానం దేశానికి ఒక పరిష్కారం చూపిస్తుందేమో కానీ, అసలు సమస్య కంటే దారుణమైన పరిణామాలకు దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. లోక్ సభకు, రాష్ట్రాలకు ఒకేసారి ఎన్నికలు జరపడమంటే భారతదేశ సమాఖ్య నిర్మాణం, ప్రజాస్వామ్య వైవిధ్యం దెబ్బతింటుందని అన్నారు. రాష్ట్రాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు కాలరాసినట్లవుతుందని విమర్శించారు. జమిలి ఎన్నికలు జరిగితే జాతీయ స్థాయి పార్టీలకే ప్రయోజనం చేకూరుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాంతీయ సమస్యలు, ప్రజల మనోభావాలు పక్కకు వెళతాయని అన్నారు. కేవలం ఖర్చు తగ్గుతుందనే కారణంతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయకూడదని అన్నారు.



## యుద్ధం ఎనిమిదేళ్ళు జరిగినా అమెరికా, ఇజ్రాయెల్‌కు లొంగే ప్రసక్తే లేదు

ఇరాన్ సుప్రీం లీడర్ ప్రతినిధి డాక్టర్ అబ్దుల్ మజీద్ హకీమ్ ఇలాహీ



**న్యూఢిల్లీ, మహా :** పశ్చిమ ఆసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ, ఇరాన్ తన సార్వభౌమాధికారాన్ని వదులుకునే ప్రసక్తే లేదని ఆ దేశ సుప్రీం లీడర్ ప్రతినిధి డాక్టర్ అబ్దుల్ మజీద్ హకీమ్ ఇలాహి స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన అమెరికా, ఇజ్రాయెల్ దాడుల అంశంపై ఢిల్లీలో ఆయన మీడియాకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇరాన్ ఎన్నడూ లొంగిపోలేదని, అవసరమైతే మరో ఎనిమిదేళ్ల సుదీర్ఘ యుద్ధం చేయడానికి కూడా తమ దేశం సిద్ధంగా ఉందని ఆయన ప్రకటించారు. ఇరాన్ అణుబాంబు తయారు చేస్తోందన్న ప్రచారాన్ని ఆయన ఖండిస్తూ, అణు ఆయుధాల తయారీ ఇస్లాం ధర్మానికి విరుద్ధమని , తమ నాయకత్వం కూడా దీనిని ఇప్పటికే స్పష్టం చేసిందని గుర్తుచేశారు.

### బంకర్లలోకి వెళ్లేందుకు నిరాకరించిన సుప్రీం లీడర్

సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ ప్రాణాలకు ముప్పు ఉందని తెలిసినా, ఆయన సామాన్య ప్రజలను విడిచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు నిరాకరించారని ఇలాహి వెల్లడించారు. 9 కోట్ల మంది ఇరానియన్లను బంకర్లలో ఉంచగలిగితేనే నేను అక్కడికి వస్తానని ఆయన భద్రతా సిబ్బందితో చెప్పారని వివరించారు. ఇదే సమయంలో డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఇరాన్‌కు కొత్త నాయకుడిని ఎన్నుకునే అధికారం అమెరికాకు లేదని, అలాంటి మాటలు వింటే ఇరాన్ చిన్న పిల్లలు కూడా నవ్వుకుంటారని ఎద్దేవా చేశారు. ట్రంప్ తన దృష్టిని అమెరికాలోని నగరాల మేయర్ల ఎంపికపై పెట్టుకుంటే మంచిదని హితవు పలికారు.

### పొరుగు దేశాలకు హెచ్చరిక

హెజ్బుల్లా, హమాస్, హౌతీల వంటి సంస్థలను ఆయన సమర్థించారు. ఇజ్రాయెల్ అణచివేతకు వ్యతిరేకంగానే వారు పోరాడుతున్నారని, మానవత్వం లేని పరిస్థితుల్లో బతుకుతున్న వారు తిరగబడటంలో తప్పులేదన్నారు. అలాగే పొరుగు దేశాలైన యూఏఈ, కువైట్, బహ్రెయిన్ వంటి వాటిపై దాడుల గురించి స్పందిస్తూ.. మా భూభాగంపై దాడి చేయడానికి అమెరికాకు మీ నేలని ఇవ్వకండి. ఒకవేళ అమెరికా దాడులకు మీరు సహకరిస్తే, మమ్మల్ని మేము కాపాడుకునే హక్కు మాకు ఉంటుంది అని కీలక హెచ్చరిక చేశారు. భారత్‌కు కూడా ఈ యుద్ధ సెగ తగులుతుందని, చమురు ధరల పెరుగుదల వల్ల నష్టపోయే భారత్ కూడా ట్రంప్‌పై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

### హోర్ముజ్ జలసంధి మూసివేతపై సంకేతాలు

ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన హోర్ముజ్ జలసంధిని మూసివేయడంపై కూడా ఆయన స్పందించారు. ఇప్పటి వరకు ఇరాన్ దానిని మూసివేయలేదని, కానీ ఒకవేళ ఆ పరిస్థితి వస్తే మాత్రం అది అందరికీ మూసుకుపోతుందని హెచ్చరించారు. మరోవైపు యుద్ధంలో రష్యా, చైనా మద్దతుపై వస్తున్న వార్తలను ఆయన కేవలం మీడియా ఊహాగానాలుగా కొట్టిపారేశారు. శాంతి స్థాపన జరగాలంటే ప్రపంచ దేశాలు ట్రంప్, నెతన్యాహు దగ్గరకు వెళ్లి యుద్ధం ఆపమని చెప్పాలని, బాధితులైన ఇరాన్‌ను నియంత్రించమనడం సబబు కాదని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు.

## ఇరాన్‌కు రష్యా సంపూర్ణ మద్దతు

పుతిన్ ప్రకటన

### నూతన సుప్రీం ముజ్తబా కు అభినందనలు

**మహా:** రష్యా అధ్యక్షుడు పుతిన్ కీలక ప్రకటన చేశారు. ఇజ్రాయెల్ అమెరికాలతో చేస్తున్న యుద్ధంలో తమ మిత్రదేశమైన ఇరాన్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తామని ప్రకటించారు. టెహ్రాన్‌కు మాస్కో అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా ఎన్నికైన ముజ్తబా ఖమేనీకి అభినందనలు తెలిపారు. తన తండ్రి ఖమేనీ స్థానంలో వచ్చిన ముజ్తబా ఇరాన్‌ను మరింత ముందుకు తీసుకువెళ్తాడని నమ్ముతున్నట్లు పుతిన్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ దేశం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి.. ప్రజలందరినీ ఏకతాటిపైకి తీసుకువస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. సాయుధ దురాక్రమణను ఎదుర్కొంటున్న ఇరాన్‌కు ముజ్తబా అవసరమన్నారు. ఇరాన్ అధ్యక్షుడితో మాట్లాడిన పుతిన్ ఇరాన్ మాజీ సుప్రీం ఖమేనీ సహా ఇతర నేతల మృతిపై సంతాపం వ్యక్తం చేశారు.

## రాష్ట్రంలో నడుస్తోంది కాంగ్రెస్ పాలనా? మజ్లిస్ పాలనా?

బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు ప్రశ్న



**హైదరాబాద్, మహా :** తెలంగాణలో ప్రజాపాలన నడవడం లేదని, రజాకార్ పాలన నడుస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ధ్వజమెత్తారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ నిర్ణయం తీసుకునే ముందు ఓవైసీని అడిగిన తర్వాతే సీఎం రేవంత్‌రెడ్డి తీసుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తెలంగాణ పరిపాలన ఓవైసీ చేతుల్లో ఉందా ? అంటూ ప్రశ్నించారు. ప్రజల కోసం కాదు...ఓవైసీ కోసం ప్రభుత్వం నడుస్తోందా ?’ అని నిలదీశారు. తెలంగాణలో ప్రభుత్వం ఎవరిది?, కాంగ్రెస్‌దా.. లేక ఓవైసీదా? అని ట్వీట్ చేశారు.గాంధీ సరోవర్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం భారీ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించి మూసీ పరివాహక ప్రాంతాలలోని అనుమతి ఉన్న అపార్ట్ మెంట్లు, కట్టడాలను కూల్చాలన్న నిర్ణయం తీసుకోవడం, ఇందుకు యోవైసీ తమకు సమ్మతమేనని చెప్పడం తదితర పరిణామాల నేపథ్యంలో రాంచందర్ రావు తీవ్రంగా స్పందించారు. కూల్చడమే పనిగా పెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ముందుగా ఎంఐఎం నేతల అక్రమ నిర్మాణాలను కూల్చాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణలో సారా దుకాణాలను తెరవాలి

- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి
- సారాను ఎందుకు నిషేధించారో ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలి
- మధ్యప్రదేశ్, ఒడిశా తరహాలో నడపాలి

**హైదరాబాద్, మహా:** రాబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో తాను ఒక 'బాంబు' పేల్చబోతున్నానని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చెప్పారు. గతంలో స్వచ్ఛమైన సారా తాగిన వారు 115 ఏళ్ల వరకు ఆరోగ్యంగా బతికేవారని, కానీ ఇప్పుడు లిక్కర్ తాగి 80 ఏళ్లకే చనిపోతున్నారని ఆయన అన్నారు. శాస్త్రీయంగా చూస్తే సారా ఆరోగ్యానికి హానికరం కాదని ఆయన వాదించారు. అసలు తెలంగాణలో సారాను ఎందుకు నిషేధించారో ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో 'జీరో అవర్'లో ఈ అంశాన్ని లేవనెత్తుతానని, సారా దుకాణాలను మళ్లీ తెరవాలని కోరతానని చెప్పారు. మధ్యప్రదేశ్, ఒడిశా వంటి రాష్ట్రాల్లో ప్రభుత్వాలే అధికారికంగా సారా దుకాణాలను నడుపుతున్నాయని, అదే తరహాలో తెలంగాణలో కూడా ఎందుకు అమలు చేయకూడదని ఆయన ప్రశ్నించారు.



## బెంగుళూరులో హోటళ్ళు బంద్

యుద్ధం ఆగేదాకా ఇంతే... దేశంలోని ఇతర నగరాల్లోనూ ఇదే సీన్

**మహా:** ఇరాన్, అమెరికాఇజ్రాయెల్ యుద్ధం ప్రభావం బెంగళూరులోని రెస్టారెంట్లపై తీవ్రంగా పడింది. పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతల కారణంగా ఎల్పీజీ సిలిండర్ల సరఫరా హఠాత్తుగా నిలిచిపోయిందని, దీంతో రేపటి నుంచి నగర వ్యాప్తంగా హోటళ్లను మూసివేస్తామని బెంగళూరు హోటల్స్ అసోసియేషన్ పేర్కొంది. తీవ్ర కమర్షియల్ గ్యాస్ కొరత కారణంగా రేపటి నుంచి రెస్టారెంట్లు, హోటళ్లను నిర్వహించలేమని ఆ ప్రకటనలో తెలిపింది. గ్యాస్ సరఫరా దాదాపు పూర్తిగా ఆగిపోయిందని, అందుకే తాము ఈ నిర్ణయం తీసుకుంటున్నామని వెల్లడించింది. యుద్ధం నేపథ్యంలో 70 రోజుల వరకు గ్యాస్ సరఫరాకు గ్యాస్ కంపెనీలు హామీ ఇచ్చాయని, కానీ అందుకు విరుద్ధంగా గ్యాస్ సరఫరా చేయడం లేదని ఆ ప్రకటనలో తెలిపింది. అందుకే ఈ నెల 10వ తేదీ నుంచి రెస్టారెంట్లు, హోటళ్లను మూసివేస్తున్నట్లు పేర్కొంది.

## ఏపీ కాంగ్రెస్‌లో విషాధం

### కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు కన్నుమూత

**హైదరాబాద్, మహా :** కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు మరణించారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. కాంగ్రెస్ నుంచి 5 సార్లు లోక్ సభకు ఎన్నికయ్యారు సాంబశివరావు. 2013లో కేంద్రమంత్రిగా పనిచేశారు. ఆయన స్వస్థలం కృష్ణా జిల్లా పెదపారుపూడి మండలం దోసపాడు గ్రామం. ఆయన మృతితో రాజకీయ వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు, అభిమానులు, నాయకులు ఆయనకు నివాళులు అర్పిస్తున్నారు. మచిలీపట్నం నియోజకవర్గం నుంచి మూడు సార్లు, ఏలూరు నియోజకవర్గం నుంచి రెండు సార్లు ఎంపీగా ఎన్నికై సేవలు అందించారు. కేంద్ర మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహించారు. కావూరి మరణంతో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక అనుభవజ్ఞుడైన నాయకుడిని కోల్పోయామని పలువురు నేతలు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. కావూరి సాంబశివరావుకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రాజకీయ జీవితంలో ఆయన ఐదు సార్లు లోక్‌సభ సభ్యుడిగా ప్రజలకు సేవలందించారు. యూపీఏ 2 ప్రభుత్వ హయాంలో కావూరి కేంద్ర జౌళి శాఖ మంత్రిగా పని చేశారు. రాజకీయాల్లోకి రాకముందు ఇంజనీరింగ్, నిర్మాణ సంస్థ ప్రగతి కన్స్ట్రక్షన్స్ స్థాపించారు. ఇందులో విజయవంతమైన వ్యాపారవేత్తగా గుర్తింపు తెచ్చుకున్నారు. రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్‌కు దూరం అవుతూ వచ్చారు.



సమైక్య రాష్ట్రం కోసం బలంగా గళం విప్పిన నేతల్లో కావూరి ఒకరు. కాంగ్రెస్ పార్టీలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. కేంద్రంలోని కాంగ్రెస్ నేతలతో మంచి సంబంధాలు కలిగి ఉండేవారు కావూరి. తాజాగా ఆయన ఆసుపత్రిలో చేరారు అన్న వార్త తెలియగానే ఉమ్మడి రాష్ట్రానికి చెందిన పలువురు నేతలు, ప్రముఖులు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కావూరి త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. మంత్రి నారా లోకేశ్ కూడా రెండురోజుల కిందట కావూరిని పరామర్శించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

## బొగ్గు సమీకరణకు ఎన్టీపీసీకి తగిన స్వేచ్ఛ ఇవ్వండి

### విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకోండి.. సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖ

**హైదరాబాద్, మహా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖ రాశారు. రామగుండంలో ఎన్ టీపీసీ ఏర్పాటు చేయనున్న థర్మల్ పవర్ ప్రాజెక్టుతో తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ కొనుగోలు ఒప్పందం(పీపీఏ) చేసుకోవాలని కోరారు. ప్రాజెక్టుకు అవసరమైన బొగ్గును సమీకరించుకునేందుకు ఎన్ టీపీసీకి తగిన స్వేచ్ఛను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టుపై కీలక సూచనలు చేశారు. సెకండ్ ఫేజ్‌లో భాగంగా ఎన్టీపీసీ రామగుండంలో ఏర్పాటు చేయనున్న 3X800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్రాజెక్టుతో తెలంగాణ ప్రభుత్వం పీపీఏ చేసుకోవాలని సూచించారు. 5X800 మెగావాట్ల ప్రాజెక్టుకు అవసరమైన బొగ్గును సమీకరించుకోవడంలో ఎన్టీపీసీకి తగిన స్వేచ్ఛ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

మొదటి ఫేజ్ లో లాగే రెండవ ఫేజ్ లో ఉత్పత్తి చేసే విద్యుత్ లో 85 శాతం విద్యుత్ ను తెలంగాణ రాష్ట్రానికి మాత్రమే సరఫరా అవుతుందని కిషన్ రెడ్డి తన లేఖలో ప్రస్తావించారు. 3 మార్చి, 2026 న తెలంగాణ రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా అత్యధికంగా 18,139 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదయ్యిందని గుర్తు చేశారు. రానున్న రోజులలో ఈ డిమాండ్ మరింతగా పెరగనుందన్నారు. అవసరమైన విద్యుత్ ఉత్పత్తి వనరులను సమకూర్చుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నాలు చేపట్టినట్లు తెలిసిందని పేర్కొన్నారు.



### ఎన్ టీపీసీ సిద్ధంగా ఉంది

“అతి తక్కువ ఖర్చుతో, అధునాతన అల్ట్రా సూపర్ క్రిటికల్ సాంకేతిక పరిజ్ఞానంతో థర్మల్ పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేయడంలో ఎన్ టీపీసీకి దేశంలోనే విశేషమైన అనుభవం ఉంది. గతంలో విద్యుత్ రంగం మీద రాష్ట్ర శాసనసభలో జరిగిన చర్చలో భాగంగా మొదటి ఫేజ్ లో భాగంగా ఎన్ టీపీసీ రామగుండంలో ఏర్పాటు చేసిన థర్మల్ పవర్ ప్రాజెక్టును గురించి స్వయంగా మీరు ప్రశంసించారు. ఇప్పుడు 5X800 మెగావాట్ల ప్రాజెక్టుకు అవసరమైన బొగ్గును సమీకరించుకోవడంలో ఎన్ టీపీసీకి తగిన స్వేచ్ఛను ఇవ్వండి. థర్మల్ పవర్ ప్రాజెక్టు ద్వారా నాణ్యమైన విద్యుత్ ను తక్కువ ధరకే ఉత్పత్తి చేసి, తెలంగాణ రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చడానికి ఎన్ టీపీసీ సిద్ధంగా ఉంది” అని కిషన్ రెడ్డి తెలిపారు. ఈ విషయంలో వ్యక్తిగతంగా చొరవ తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డిని కిషన్ రెడ్డి కోరారు. “రామగుండంలో ఏర్పాటు చేయనున్న 3X800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్రాజెక్టుతో తెలంగాణ ప్రభుత్వం పీపీఏ చేసుకునేలా కృషి చేయాలి. అటు ప్రభుత్వానికి, ఇటు ప్రజలకు మేలు చేకూర్చే రామగుండం థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుకు సహకరించాలి” అని సూచించారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు..

- **30 రోజులకు మించి ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండకూడదు..**
- **ఈ-ఆఫీస్ ద్వారానే ఫైళ్ల నిర్వహణ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్..**



**నల్గొండ, మహా :** ప్రజావాణి ద్వారా వచ్చే ఫిర్యాదులను జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన అనంతరం ఆయన జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో ఏమాత్రం జాప్యం జరగకూడదని ముఖ్యంగా ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్న శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి పెండింగ్ లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఏదైనా ఫిర్యాదు పరిష్కారం వివిధ కారణాల వల్ల ఆలస్యమవుతున్నట్లయితే ఆ విషయాన్ని మధ్యంతర జవాబు ద్వారా ఫిర్యాదుదారుకు తప్పనిసరిగా తెలియజేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా పెండింగ్ ఫిర్యాదుల సంఖ్య 150కి మించకూడదని ఏ ఒక్క ఫిర్యాదు కూడా 30 రోజులకు మించి పెండింగ్‌లో ఉండటానికి వీల్లేదని అధికారులను హెచ్చరించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పెండింగ్ ఫైళ్ల జాబితాను రూపొందించి ఈ నెల 15లోపు వాటిని పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. వచ్చే వారం నాటికి పెండింగ్ ఫైళ్లతో సహా పరిష్కరించిన పూర్తి వివరాలను సమర్పించాలని చెప్పారు. ఇకపై జిల్లాలోని అన్ని కార్యాలయాల ఫైళ్లను 'ఈ-ఆఫీస్' ద్వారానే నిర్వహించడం జరుగుతుందని ఇందుకు గాను ఎన్.ఐ.సి ద్వారా ప్రతి శాఖకు ప్రత్యేక మెయిల్ ఐడి కేటాయించనున్నట్లు వెల్లడించారు. భవిష్యత్తులో మాన్యువల్ ఫైళ్లకు బదులుగా ఆన్‌లైన్ ద్వారానే ఫైళ్లను సమర్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న రోజువారీ అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ కోరారు. సోమవారం నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ సహా అన్ని మున్సిపాలిటీలలో 5కే రన్ మారథాన్ నిర్వహించినట్లు తెలిపారు. అలాగే సెగ్రిగేషన్ షెడ్ల, పార్కుల అభివృద్ధిపై దృష్టి సారించాలని గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు మరియు డంపింగ్ యార్డులను ఖచ్చితంగా వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. పదో తరగతి పరీక్షల ఏర్పాట్లను పటిష్టంగా పూర్తి చేయాలని, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై మండల ప్రత్యేక అధికారులు తమ నివేదికలను అందజేయాలన్నారు. జనగణన ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ బ్లాక్‌లను ఖరారు చేసి, సూపర్వైజర్ల నియామకాలను చేపట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ప్రకారం ఉగాది నాటికి సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించాల్సి ఉన్నందున గ్రామ పంచాయతీల వారీగా కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేసేలా మండల ప్రత్యేక అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ ఆదేశించారు. కాగా, ఈ సోమవారం జరిగిన ప్రజావాణిలో మొత్తం 125 ఫిర్యాదులు అందాయి. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 72, ఇతర జిల్లా అధికారులకు సంబంధించి 53 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ (ఇంచార్జ్) వై. అశోక్ రెడ్డి, ఆర్డీవోలు రమణారెడ్డి, శ్రీదేవి తదితరులు పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం వ్యాయామమే రక్షణ కవచం..

- **నల్గొండలో ఉత్సాహంగా '5 కే రన్'..**
- **జెండా ఊపి ప్రారంభించిన మేయర్ బుర్రి చైతన్య..**
- **ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి కలెక్టర్ బి. చంద్రశేఖర్..**



**నల్గొండ, మహా :** ఆరోగ్యం బాగుంటేనే జీవితంలో ఏదైనా సాధించగలమని ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా సోమవారం నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 5 కే రన్‌ను ఆమె జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్‌తో కలిసి ఎన్జీ కళాశాల మైదానం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో శారీరక శ్రమ తగ్గిపోతోందని ప్రతి ఒక్కరూ ఇంట్లోనే పరిమితం కాకుండా బయటకు వచ్చి వాకింగ్ లేదా వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యచరణను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికీ చేరాలన్నదే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఆరోగ్యానికి మించిన ఆస్తి మరొకటి లేదని ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా ఈ రన్‌ను నిర్వహించినట్లు తెలిపారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో చాలామంది జీవనశైలి సమస్యలతో సతమతమవుతున్నారని వాటిని అధిగమించాలంటే నిత్యం వ్యాయామం తప్పనిసరని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ శక్తి మేరకు నడకను అలవాటు చేసుకోవాలని హితవు పలికారు. ఎన్జీ కళాశాల నుండి క్లాక్ టవర్ వరకు ఉత్సాహంగా సాగిన ఈ పరుగులో యువత, అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. క్లాక్ టవర్ వద్ద భారీ మానవహారం నిర్వహించిన అనంతరం, పరుగులో పాల్గొన్న వారందరితో కలెక్టర్ ఆరోగ్యం మరియు సామాజిక బాధ్యతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ (ఇంచార్జ్) వై. అశోక్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బి. శరత్ చంద్ర, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, కార్పొరేటర్లు పెరిక స్వాతి, మామిడి కార్తీక్, డాక్టర్ పుల్లారావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కార్మికులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నల్లగొండలో సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించిన మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి

**నల్లగొండ, మహా :** నల్లగొండ పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా పలు డివిజన్లలో నూతనంగా ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి సోమవారం ఘనంగా ప్రారంభించారు. పట్టణంలోని 1, 2, 3, 18, 19, 40 మరియు 41వ డివిజన్ల పరిధిలో ఏర్పాటు చేసిన ఈ విద్యుత్ దీపాలను ఆమె స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని, ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులను కూడా వెలుగులతో నింపుతున్నామని తెలిపారు. డివిజన్ల అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం కృషి చేస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, నల్లగొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ పాల్గొని పట్టణ అభివృద్ధికి జరుగుతున్న కృషిని అభినందించారు. అలాగే నల్లగొండ PACS చైర్మన్



ఆలకుంట్ల నాగరత్నం రాజు, 40వ డివిజన్ కౌన్సిలర్ బొడ్డుపల్లి లక్ష్మి, 18వ డివిజన్ కౌన్సిలర్ ఆలకుంట్ల ఝాన్సీరాణి నాగరత్నం రాజు, 41వ డివిజన్ కౌన్సిలర్ కేసాని వేణుగోపాల్ రెడ్డిలు పాల్గొని తమ డివిజన్లలో చేపట్టిన ఈ అభివృద్ధి పనుల పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది మరియు స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వల్ల ఆయా ప్రాంతాల్లో చీకటి సమస్య తొలగిపోయిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# బెల్ట్ షాపుల దందాను అరికట్టాలి

**బిజెపి నాయకులు గ్రీవెన్స్ లో ఫిర్యాదు**

**బూర్గంపహాడ్ మహా :** బూర్గం పహాడ్ మండలంలో నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపుల దందాను అరికట్టాలని మండల బిజెపి నాయకులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్ లో సోమవారం ఫిర్యాదు చేశారు. మండలంలో విచ్చలవిడిగా మద్యం బెల్టు షాపులు నడుపుతూ అధిక రేట్లకు మద్యం అమ్ముతూ ఎమ్మార్పీ రేట్ల కన్నా 40 నుంచి 50 రూపాయలు అధికంగా వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. అదనపు వసూలు చేస్తూ సామాన్యుల జేబులకు చిల్లు పెడుతున్నారని అబ్కారీ శాఖ అధికారులు పర్యవేక్షించాల్సింది పోయి చోద్యం చూస్తున్నారని పేర్కొన్నారు. కాస్ట్లీమద్యం లైసెన్స్ పొందిన షాపుల్లో దొరకాల్సింది బెల్ట్ షాపుల్లో అమ్ముతున్నారని షాపుల నిర్వాహకులే స్వయంగా బెల్ట్ షాపులకు మద్యాన్నితరలిస్తున్నారని ఫ్రంట్ షాపుల నిర్వాహకులు అధిక మొత్తంలో మద్యం విక్రయించడంతో సామాన్యులకు ఇబ్బందిగా మారిందని అన్నారు. ఎమ్మార్పీ రేట్లు అమ్మకుండా అధిక మొత్తంలో బెల్ట్ షాపుల ద్వారా అమ్మేస్తున్న అమ్ముతున్న మద్యం మాఫియా పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు చుక్కపల్లి బాలాజీ ,భానోత్ వెంకటేష్, శరత్ బాబు పాల్గొన్నారు.



## ఘన వ్యర్థాల నిర్వహణ వల్ల పర్యావరణ కాలుష్యం తగ్గుతుంది

**సర్పంచ్ కుంజా కొండమ్మ**

**బూర్గంపహాడ్ మహా :** ఘన వ్యర్థాల నిర్వహణ వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయని ముఖ్యంగా పర్యావరణ కాలుష్యం తగ్గుతుందని కోయగూడెం సర్పంచ్ కుంజా కొండమ్మ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఘన వ్యర్థాలు గడ్డి ఆకులు పండ్లు కూరగాయల తొక్కలు జంతువుల వ్యర్థాలు వంటివి సరిగ్గా నిర్వహించకపోతే వాతావరణ కాలుష్యానికి దారితీస్తుందని అన్నారు. ఘన వ్యర్థాలను కంపోస్టు ఎరువుగా మార్చుకోవచ్చు అని అన్నారు. ఘన వ్యర్థాల నుండి బయోగ్యాస్ ఉత్పత్తి చేయవచ్చని తెలిపారు. కృత్రిక జీవుల సహాయంతో ఘన వ్యర్థాలను వర్మీ కంపోస్టింగ్ గా మార్చవచ్చని అన్నారు. ఘన వ్యర్థాలను సురక్షితంగా బూడిదగా మార్చవచ్చని అన్నారు ఇలా చేయడం వలన పర్యావరణం కాలుష్యం తగ్గుతుందని నేల సారం పెరుగుతుందని శక్తి ఉత్పత్తి సహాయపడుతుందని వ్యర్థాల నిర్వహణ ఖర్చు తగ్గుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, ఉప సర్పంచ్ కృష్ణవేణి,వార్డు సభ్యులు సుశీల,వెంకటరమణ,రాజ,శ్రీను, గ్రామస్తులు దుర్గా ప్రసాద్, నాగేశ్వరరావు,సత్తి రెడ్డి, సతీష్ యాదవ్, ఝాన్సీ,బులి,ఐటీసీ అనుబంధ సంస్థ ఎం ఎస్ కె ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో.. మణుగూరులో అవగాహన ర్యాలీ..

- **నీటిని పొదుపు చేద్దాం.. మొక్కలను పెంచుదాం..**
- **మణుగూరు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్..**



**మణుగూరు, మహా :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మణుగూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పూల మార్కెట్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు సాగిన ఈ ర్యాలీలో మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ర్యాలీ సందర్భంగా అధికారులు నీటిని పొదుపు చేద్దాం.. మొక్కలను పెంచుదాం.. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుదాం.. అనే నినాదాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ కమిషనర్ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజల భాగస్వామ్యంతోనే పట్టణ అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. నీటి వనరులను సంరక్షించడం, పర్యావరణాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.99 రోజుల కార్యాచరణతో ప్రజా సమస్యల పరిష్కారం కోసం, తెలంగాణ ప్రభుత్వం ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక పేరుతో 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి ప్రకటించిన ఈ కార్యక్రమం మార్చి 6 నుంచి జూన్ 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగనుందని పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాల్లో అధికారులు ప్రత్యక్షంగా ప్రజలను కలుసుకొని సమస్యలను తెలుసుకుని వాటికి తక్షణ పరిష్కారాలు చూపించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. గ్రామ సభలు, వార్డ్ సమావేశాల ద్వారా ప్రజల అభిప్రాయాలను సేకరించి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, పరిశుభ్రత, మహిళా సంక్షేమం, యువత అభివృద్ధి వంటి రంగాల్లో ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రేషన్ కార్డులు, గృహ పథకాలు తదితర సంక్షేమ పథకాలను అర్హులకు త్వరితగతిన అందించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ ప్రసాద్, తహసీల్దార్ అద్దంకి నరేష్, సీఐ నాగబాబు, ఎంపీవో పల్నాటి వెంకటేశ్వర్లు, లైన్స్ క్లబ్ సభ్యులు రామారావు, కుంజ నరసింహారావు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రేపు విద్యుత్ వినియోగదారుల సదస్సు

**తాళ్లగొమ్మూరు రైతు వేదికలో నిర్వహణ**

**బూర్గంపహాడ్ మహా:** బూర్గంపహాడ్ మండల పరిధిలోని తాళ్లగొమ్మూరు రైతు వేదికలో ఈ నెల 11వ తేదీన విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించనున్నట్లు టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్పర్సన్ ఎన్వి వేణుగోపాల చారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సదస్సులో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు, వోల్టేజ్ హెచ్చుతగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ పెంపుదల వంటి సమస్యలపై వినియోగదారులు రాతపూర్వకంగా ఫిర్యాదులు అందజేయాలని సూచించారు.అలాగే లోపాలు ఉన్న మీటర్ల మార్పు, కొత్త సర్వీసుల మంజూరు, లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీస్ పేరు మార్పు, వాడకానికి మించి వచ్చిన అధిక బిల్లులు, కేటగిరీ మార్పు, సర్వీస్ రద్దు తదితర అంశాలపై కూడా వినియోగదారులు తమ ఫిర్యాదులను సమర్పించాలని కోరారు.ఈ సదస్సు ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే నిర్వహించనున్నందున వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు తెలిపారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**జిల్లా కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** జిల్లాలోని వసతి గృహ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారంతో కూడిన భోజనం అందించడంతో పాటు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు సమగ్రంగా కల్పించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన ములకలపల్లి మండలంలో పర్యటించి ములకలపల్లి కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం, మూకమామిడిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలోని అన్ని తరగతి గదులను సందర్శించి విద్యార్థుల హాజరు బోధన పరిస్థితులను పరిశీలించారు. అలాగే వంటశాల భోజనశాల మరుగుదొడ్లు ఆహారపదార్థాల నాణ్యత పాఠశాల ఆవరణలోని పరిశుభ్రత తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతపై ప్రత్యేకంగా ఆరా తీశారు.అనంతరం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. ఇంటర్ పరీక్షలు పూర్తైన తర్వాత ఏ కోర్సులు చదవాలని భావిస్తున్నారు. భవిష్యత్తులో ఏ లక్ష్యాలు పెట్టుకున్నారో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకొని ఉన్నత విద్యలో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా కేజీబీవీ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రీ-ఫైనల్ పరీక్షలను కూడా కలెక్టర్ పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాస్తున్న తీరు గమనించి పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు రాబోయే పరీక్షలకు సమగ్రంగా సిద్ధం కావాలని సూచిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. పదవ తరగతి విద్యార్థులకు సాయంత్రం స్టడీ అవర్లో స్నాక్స్ అందించాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు పాఠశాలలో అందిస్తున్న సౌకర్యాల గురించి కూడా విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. విద్యార్థులు ఉపయోగిస్తున్న పుస్తకాలను పరిశీలించి వారి రాత సామర్థ్యాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన ఆర్.ఓ నీటి శుద్ధి కేంద్రాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. తాగునీటి నాణ్యతను నిరంతరం పర్యవేక్షిస్తూ విద్యార్థులకు శుద్ధమైన తాగునీరు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారంతో కూడిన భోజనం అందించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందించాలని వంట చేసే సమయంలో పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అలాగే పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవడం ఉపాధ్యాయులు సిబ్బంది విద్యార్థులందరి బాధ్యత అని అన్నారు. వసతి గృహ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు సమర్థంగా అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ పర్యటనలో కలెక్టర్ వెంట కేజీబీవీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మహేశ్వరి, ఎంఈఓ సత్యనారాయణ, ఎంపీడీవో, ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపల్ అశోక్, పాఠశాలల బోధన బోధనేతర సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మణుగూరు గురుకులంలో ఫుడ్ పాయిజన్ కలకలం

- **మొదట నలుగురు... తర్వాత మరో ఏడుగురు విద్యార్థులకు అస్వస్థత లక్షణాలు..**
- **బయట నుంచి వచ్చిన ఆహారమే కారణమా..?**
- **చిన్నారులకు చికిత్స అందిస్తున్న ఏరియా ఆసుపత్రి వైద్యులు..**
- **ఎమ్మెల్యే పాయం, మాజీ ఎమ్మెల్యే రేగా పరామర్శ..**



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అనుమానంతో విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన కలకలం రేపింది. సోమవారం పాఠశాలలో తొలుత నలుగురు విద్యార్థులు అస్వస్థతకు గురికాగా, అనంతరం మరో ఏడుగురు విద్యార్థుల్లో కూడా ఇదే లక్షణాలు కనిపించడంతో వారిని వెంటనే మణుగూరు ఏరియా వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు.ప్రాథమిక సమాచారం ప్రకారం విద్యార్థులు బయట నుండి తీసుకొచ్చిన ఆహారం తినడంతో ఫుడ్ పాయిజన్ జరిగినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనతో పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకునేందుకు ఆసుపత్రికి వెళ్లిన తల్లిదండ్రులను మీడియాను వైద్య సిబ్బంది పాఠశాల నిర్వాహకులు అనుమతించకపోవడంతో పాటు నిర్లక్ష్యమైన సమాధానాలు చెప్పడంపై పలు విమర్శలు వెల్లువెత్తాయి. సమాచారం తెలుసుకున్న తాసిల్దార్ అద్దంకి నరేష్,ఎంపిఓ పల్నాటి వెంకటేశ్వర్లు తోపాటు ఇతర శాఖల అధికారులు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వెళ్లి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

**విద్యార్థులను పరామర్శించిన ఎమ్మెల్యే పాయం..**

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను వైద్య సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ రవి కుమార్, స్థానిక అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

**పాఠశాల నిర్వాహకులపై మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే రేగా..**

ఫుడ్ పాయిజన్ సంఘటన సమాచారం తెలిసిన వెంటనే మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.విద్యార్థులు అస్వస్థతకు గురికావడానికి బయట నుంచి ఆహారం తీసుకొచ్చిన వ్యక్తే కారణమని సమాచారం రావడంతో, ఆ వ్యక్తిపై రేగా కాంతారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫుడ్ తెచ్చింది నేనే అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఆయన తీవ్రంగా స్పందించి పాఠశాల నిర్వాహకులపై మండిపడ్డారు. ఇలాంటి చర్యలు పునరావృతమైతే సహించేది లేదని హెచ్చరించారు. ఇక విద్యార్థులను పరామర్శించేందుకు వచ్చిన రేగా కాంతారావు, మీడియా ప్రతినిధులకు వైద్య సిబ్బంది, గురుకుల పాఠశాల నిర్వాహకులు అభ్యంతరం వ్యక్తం చేయడం ఉద్రిక్తతకు దారితీసింది. దీనిపై రేగా కాంతారావు తీవ్రంగా మండిపడ్డారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న జిల్లా కలెక్టర్ స్పందించి, సంఘటనపై విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. అడిషనల్ కలెక్టర్ కూడా ఘటనకు సంబంధించి ఆరా తీసినట్లు సమాచారం.

**బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి - రేణుక అక్షర మహిళా మండలి..**

మణుగూరు బాలికల గురుకుల రెసిడెన్షియల్ స్కూల్ లో ఆహార భద్రతా నియమాలు పూర్తిగా నిర్లక్ష్యం చేయబడ్డాయని, విద్యార్థినిలకు అందించిన నాసిరకం వంటకాల కారణంగానే విద్యార్థినిలకు వాంతులు, విరోచనాల లక్షణాలు కనిపించాయని, వారిలో నలుగురిని మాత్రమే ఆసుపత్రిలో చేర్చగా, మిగతా విద్యార్థినిల అస్వస్థత విషయాన్ని దాచిపెట్టి బయట నుంచి తీసుకొచ్చిన ఆహారం వల్ల ఫుడ్ పాయిజన్ జరిగిందని చెప్పడం బాధ్యతారాహిత్యమని రేణుక అక్షర మహిళ మండలి అధ్యక్షురాలు సరోజ మండిపడ్డారు. ఈ ఘటనకు బాధ్యులైన హాస్టల్ వార్డెన్, ప్రిన్సిపాల్, సిబ్బంది, మాంసం సరఫరా చేసిన కాంట్రాక్టర్‌పై జిల్లా కలెక్టర్ వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థినిలకు నాణ్యమైన, తాజా ఆహారం అందించేలా పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని అధికారులను కోరారు. అనంతరం రేణుక అక్షర మహిళా మండలి ఆధ్వర్యంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినిలకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గురిజాల వరలక్ష్మి, ఎండి షబానా, కోరి శ్యామల, రెడ్డిబోయిన రేణుక, కన్నాపురం వసంత, కన్నాపురం శైలజ, సౌజన్య డాకూరి, లక్కింశెట్టి హేమలత తదితరులు పాల్గొన్నారు.




## మహిళా కానిస్టేబుల్ నాగజ్యోతిని సన్మానించిన సీఐ వెంకటప్పయ్య

**మహా దుమ్ముగూడెం:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ నాగజ్యోతి ని దుమ్ముగూడెం సిఐ వెంకటప్పయ్య ఘనంగా సన్మానించారు. సోమవారం దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్ లో జరిగిన ఓ కార్యక్రమంలో నాగజ్యోతి కి పుష్పగుచ్ఛం ఇచ్చి సాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన డ్యూటీలో అద్భుతమైన పనితీరును, అంకితభావాన్ని చూపిస్తూ సేవలందిస్తుందని కొనియాడారు. ఈ సందర్భంగా సీఐ వెంకటప్పయ్య నాగజ్యోతి కి రూ. 5,000/ నగదు బహుమతిగా అందజేసి ప్రోత్సహించారు. స్టేషన్ లో కానిస్టేబుల్స్, సిబ్బందికి మిఠాయిలు పంచి, మహిళా దినోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. మహిళల సాధనలను, వారి సేవలను కొనియాడారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఇలాంటి ప్రోత్సాహక చర్యలు మహిళా సిబ్బందికి మరింత ఉత్సాహాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఇస్తాయని సీఐ తెలిపారు.

# హెచ్ పీవి వాక్సిన్ కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం



- **ఐటీసీ సహకారంతో రూ.5 లక్షల విలువైన వీల్ చైర్స్ పంపిణీ..**
- **డాక్టర్ సునీల్ మంజ్నేకర్‌కు ఆత్మీయ వీడ్కోలు.. సన్మానం..**
- **120 మంది సిబ్బందికి ప్రశంసా పత్రాలు**

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సోమవారం నిర్వహించిన ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమంలో నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో హ్యూమన్ పాపిల్లోమా వైరస్ (హెచ్ పి ఓ) వ్యాక్సిన్ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.అలాగే సారపాక ఐటిసి లిమిటెడ్ కంపెనీ సహకారంతో ఆసుపత్రికి అందించిన రూ.5 లక్షల విలువైన వీల్ చైర్లను ప్రారంభించి ఆసుపత్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రిలో సూపర్ ఇంటెండెంట్‌గా, వైద్యుడిగా సేవలు పూర్తి చేసుకొని వైద్యశాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ అభ్యసించేందుకు వెళ్తున్న డాక్టర్ సునీల్ మంజ్నేకర్‌కు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆత్మీయ వీడ్కోలు, సన్మానం నిర్వహించి, ఆసుపత్రి అభివృద్ధికి ఆయన చేసిన సేవలను ప్రశంసించారు. అనంతరం ఆసుపత్రిలో పనిచేస్తున్న 120 మంది సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది చేస్తున్న సేవలు అభినందనీయమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ రవి బాబు, మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, సమితి సింగారం సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, లంక మల్లారం సర్పంచ్ పూణెం రమేష్, గుట్ట మల్లారం సర్పంచ్ కారం పూజిత, 14 టైర్ యూనియన్ అధ్యక్షుడు దుగ్గంపూడి ఈశ్వర్ రెడ్డి, మైనార్టీ అధ్యక్షుడు రహీం పాషా, ఉప సర్పంచ్ అచ్చ నవీన్, వార్డు సభ్యురాలు కొలపిన్ని మానస, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ANN తెలుగు

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్
10-03-2026

మహా రాణి

04



కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి రెడ్డి



పద్మావతి ఉత్తమ్ కుమార్ రెడ్డి



యశస్విని రెడ్డి

# సూపర్ రిచ్

# మహిళా ఎమ్మెల్యేలు

## దేశంలో 14 మంది మహిళా ప్రజాప్రతినిధులు బిలియనీర్లు

## అత్యంత సంపన్నుల జాబితాలో తొలి మూడు స్థానాలు ఏపీ ఎమ్మెల్యేలవే

## రూ.716 కోట్ల ఆస్తులతో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి దేశంలో నెంబర్1

## నెంబర్ 2గా కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి రెడ్డి – రూ.388 కోట్లు

## తెలంగాణ నుండి యశస్విని, పద్మావతి ఉత్తమ్ టాప్

(మహా ప్రత్యేకం)

దేశరాజకీయాల్లో మహిళలు సూనర్ రిచ్ గా అవతరిస్తున్నారు. దేశంలో మహిళల ప్రాతినిధ్యం క్రమేపీ పెరుగుతుండగా, ప్రస్తుతం రాజకీయాల్లో ఉన్న కొద్దిమంది మహిళల్లో కొందరు అత్యంత సంపన్నులుగా ఉన్న విషయం తాజా అధ్యయనంతో వెలుగులోకి వచ్చింది. ప్రజాస్వామ్యంలో మహిళల పాత్ర, వారి రాజకీయ మరియు ఆర్థిక స్థితిగతులపై ప్రముఖ స్వచ్ఛంద సంస్థ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ విడుదల చేసిన నివేదిక దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల రాజకీయ ప్రాతినిధ్యం పేరిట విడుదల చేసిన ఈ నివేదికలో దేశవ్యాప్తంగా మహిళా ప్రజాప్రతినిధుల ఆస్తులు, వారి సంఖ్య, రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం వంటి అంశాలను విశ్లేషించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలు సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా ఈ అధ్యయనం జరిపినట్లు ఏడీఆర్ వెల్లడించింది.

### దేశంలో 14 మంది మహిళా బిలియనీర్లు...

నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా ఉన్న మహిళా ప్రజాప్రతినిధుల్లో 14 మంది బిలియనీర్లు ఉన్నారు. ఈ 14 మంది మహిళా నేతల మొత్తం ఆస్తి విలువ రూ.8,234 కోట్లుగా అంచనా వేసినట్లు ఏడీఆర్ తెలిపింది. అత్యంత ఆసక్తికర విషయం ఏమిటంటే — దేశంలోని అత్యంత సంపన్న మహిళా ప్రజాప్రతినిధుల మొదటి మూడు స్థానాలను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎమ్మెల్యేలే దక్కించుకోవడం.

### తెలంగాణలో వారే...

తెలంగాణలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పేరుపై రూ.56కోట్ల విలువైన ఆస్తులున్నట్లు పేర్కొనగా, కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి రెడ్డి (ఉత్తమ్ పద్మావతి) 2023 తెలంగాణ ఎన్నికల అఫిడవిట్ ప్రకారం, వారి కుటుంబం యొక్క స్థిర మరియు చరాస్తుల మొత్తం విలువ సుమారు ₹42.31 కోట్లు (అన్ని ఆస్తులు కలిపి). ఇక వాకిటి సునిత లక్ష్మారెడ్డి రూ.4.98 కోట్లు, మంత్రి కొండా సురేఖకు రూ.4కోట్లు విలువైన ఆస్తులున్నాయి.





## వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి – రూ.716 కోట్లు



టీడీపీకి చెందిన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి రూ.716కోట్ల ఆస్తులతో దేశంలోనే అత్యంత సంపన్న మహిళా ప్రజాప్రతినిధిగా నిలిచారు. వ్యాపార నేపథ్యం, కుటుంబ ఆర్థిక స్థితి కలిసి ఆమెను ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిపాయని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. కోవూరు నియోజకవర్గం నుంచి విజయం సాధించిన మహిళా ప్రజాప్రతినిధిగా వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సంచలనమయ్యారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే నాయకురాలిగా గుర్తింపు పొందారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ అందుబాటులో ఉండే ప్రజానేతగా ప్రశాంతమ్మ పేరు సంపాదించారు. విద్య, వైద్యం, సేవా కార్యక్రమాల్లో కుటుంబం తరపున అనేక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇస్తూ మహిళల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. కోవూరు అభివృద్ధికి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నారు. ప్రజలతో సన్నిహితంగా మెలిగి సమస్యలను త్వరగా పరిష్కరించే నాయకురాలిగా నిలిచారు. దేశంలోనే అత్యంత సంపన్న మహిళా ప్రజాప్రతినిధిగా గుర్తింపు పొందడం ఆమె ప్రత్యేకత. ప్రజాసేవను లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతున్న మహిళా నాయకత్వానికి ప్రశాంతి రెడ్డి ఒక ఉదాహరణగా నిలుస్తున్నారు.



## రెడ్డెప్పగారి మాధవి రెడ్డి - రూ.388 కోట్లు

కడప నుంచి టీడీపీ తరఫున గెలిచిన రెడ్డెప్పగారి మాధవి రెడ్డి రూ.388 కోట్ల ఆస్తులతో రెండో స్థానంలో నిలిచారు. కడప రాజకీయాల్లో మాధవిరెడ్డి ఫైర్ బ్రాండ్ గా తక్కువ కాలంలోనే పేరు తెచ్చుకున్నారు. ప్రజలతో సన్నిహితంగా మెలిగే నాయకత్వం ఆమెకు ప్రత్యేక గుర్తింపుగా నిలిచింది. నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుగా వ్యవహరిస్తున్నారు. మహిళల సంక్షేమం, సాధికారత కోసం ప్రత్యేక కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నారు. విద్య, వైద్యం వంటి రంగాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందారు. రెడ్డప్పగారి మాధవి అంటే భయపడని రాజకీయానికి మారుపేరుగా నిలిచారు. వైఎస్ కంచుకోటలో విజయబావుటా ఎగరేసి ప్రత్యర్థులకు చెమటలు పట్టిస్తున్నారు.

## మహిళల ప్రాతినిధ్యం ఇంకా 10 శాతమే...

ఏడీఆర్ నివేదిక ప్రకారం భారత రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం ఇప్పటికీ తక్కువగానే ఉంది. దేశవ్యాప్తంగా ఉన్న 4,666 మంది ప్రజాప్రతినిధుల్లో మహిళలు కేవలం 464 మంది మాత్రమే ఉన్నారు. అంటే మొత్తం ప్రాతినిధ్యంలో మహిళల వాటా సుమారు 10 శాతం మాత్రమే.

**లోక్‌సభలో...**
మొత్తం ఎంపీలు – 543
మహిళా ఎంపీలు – 74

**రాష్ట్ర అసెంబ్లీలలో...**
మొత్తం ఎమ్మెల్యేలు – 4,123
మహిళా ఎమ్మెల్యేలు – 390

ఈ గణాంకాలు మహిళల రాజకీయ భాగస్వామ్యం పెరగాల్సిన అవసరాన్ని స్పష్టంగా సూచిస్తున్నాయని విశ్లేషకులు అంటున్నారు. మహిళా ప్రజాప్రతినిధుల ఆస్తుల విషయంలో తెలుగు రాష్ట్రాల మధ్య కూడా గణనీయమైన తేడా కనిపించిందని ఏడీఆర్ పేర్కొంది.

**ఆంధ్రప్రదేశ్**
మహిళా ప్రజాప్రతినిధులు – 24 మంది
సగటు ఆస్తి – రూ.74 కోట్లు

**తెలంగాణ**
మహిళా ప్రజాప్రతినిధులు – 11 మంది
సగటు ఆస్తి – రూ.14 కోట్లు

ఈ గణాంకాల ప్రకారం తెలంగాణతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ మహిళా ప్రజాప్రతినిధుల సగటు ఆస్తి ఐదు రెట్లు ఎక్కువగా ఉందని నివేదిక పేర్కొంది.

### రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం

"రాజకీయాల్లో మహిళల సంఖ్య ఇంకా తక్కువగానే ఉంది. కానీ రాజకీయాల్లోకి వచ్చిన కొద్దిమంది మహిళలు ప్రభావవంతమైన స్థాయికి చేరుకుంటున్నారనేది ఈ నివేదిక చూపిస్తోంది." "మహిళల ప్రాతినిధ్యం పెరగడం భారత ప్రజాస్వామ్యానికి ఎంతో అవసరం. మహిళలు ఎక్కువగా రాజకీయాల్లోకి వస్తే పాలనలో సమతుల్యత పెరుగుతుంది." అని విశ్లేషకులు అంటున్నారు.

ఒకవైపు మహిళల ప్రాతినిధ్యం తక్కువగా ఉండటం... మరోవైపు రాజకీయాల్లో ఉన్న కొద్దిమంది మహిళల్లో కొందరు అత్యంత సంపన్నులుగా ఎదగడం... ఇది భారత రాజకీయాల్లో మహిళల సామాజిక స్థితి, రాజకీయ అవకాశాలపై కొత్త చర్చకు దారితీస్తోంది. మహిళా రిజర్వేషన్ చట్టం అమలులోకి వస్తే భవిష్యత్తులో చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.

## లోకం నాగమాధవి రూ.291కోట్లు



నెల్లిమర్ల నుంచి జనసేన తరఫున విజయం సాధించిన లోకం నాగమాధవి రూ.291 కోట్ల ఆస్తులతో మూడో స్థానంలో నిలిచారు. కష్టపడి చదివి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే దేన్నైనా సాధించవచ్చని నిరూపించిన నాయకురాలు నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే లోకం నాగమాధవి. గ్రామీణ నేపథ్యం నుంచి ప్రపంచ ఐటీ రంగానికి, అక్కడి నుంచి రాజకీయ నాయకత్వం వరకు సాగిన ఆమె ప్రయాణం యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది. ఫోర్డ్‌లో పని చేసిన అనుభవంతో తన భర్త లోకం వెంకట నాగేంద్ర వరప్రసాద్‌తో కలిసి అమెరికాలో 1994లో మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్‌ను స్థాపించడంలో కీలక పాత్ర పోషించారు. దాంట్లో వైస్ ప్రెసిడెంట్గా పని చేస్తూ ఐటీ రంగంలో విశేష అనుభవం సంపాదించారు. అంతర్జాతీయ ప్రాజెక్టులు నిర్వహిస్తూ వ్యాపార విస్తరణలో ముఖ్యపాత్ర వహించారు. ఈ సంస్థ తరువాత భారతదేశంలో విస్తరించింది. విశాఖపట్నం, విజయనగరం జిల్లా భోగాపురంలో కంపెనీలను పెట్టి వేలాది మందికి ఉద్యోగాలు కల్పించారు. సామాజిక సేవలో భాగంగా ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకుని రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో నెల్లిమర్ల నియోజకవర్గం నుంచి పోటీ చేసి ప్రజల మద్దతుతో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఐటీ రంగంలో సాధించిన అనుభవాన్ని ఇప్పుడు ఆమె నియోజకవర్గ అభివృద్ధికి వినియోగిస్తున్నారు.

ANN తెలుగు

# మహా పత్రిక

05

మంగళవారం, హైదరాబాద్ | 10-03-2026 | జిల్లా వార్తలు | DISTRICT NEWS | WWW.MAHAADAILY.COM

## బెల్ట్ కన్వేయర్ ప్రాజెక్టు పనులపై సమీక్ష

- నాణ్యత ప్రమాణాలతో గడువులోపు పూర్తి చేయాలి..
- సింగరేణి డైరెక్టర్ తిరుమలరావు



**మణుగూరు, మహా :** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ డైరెక్టర్ (ఈఅండ్ఎం) ఎం తిరుమలరావు సోమవారం మణుగూరు ఏరియాలో పర్యటించి బెల్ట్ కన్వేయర్ ప్రాజెక్టు పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్, సివిల్ విభాగ జనరల్ మేనేజర్ డి వెంకటేశ్వర్లు, సిహెచ్‌పి జనరల్ మేనేజర్ ఎస్ వి రామమూర్తితో పాటు ఇతర అధికారులతో కలిసి మణుగూరు జనరల్ మేనేజర్ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం పీకేఓసి-2, కేసిహెచ్ పి గనులను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మణుగూరు ఏరియాలో కొనసాగుతున్న గనుల కార్యకలాపాలు, అభివృద్ధి పనులు, ఉత్పత్తి పరిస్థితులు, యంత్రాల నిర్వహణ, తీసుకుంటున్న భద్రతా చర్యలపై డైరెక్టర్ కు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ గనుల నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించడం ద్వారా కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చన్నారు. ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు.పర్యటనలో భాగంగా పీకేఓసి నుండి కేసిహెచ్ పి వరకు నిర్మాణంలో కొనసాగుతున్న బెల్ట్ కన్వేయర్ ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ఈ ప్రాజెక్టును ఏషియన్ ఇందువెల్ జాయింట్ వెంచర్ సంస్థ నిర్మిస్తోంది. పీకేఓసి గనిలో తవ్వబడుతున్న బొగ్గును కేసి హెచ్ పి వరకు వేగంగా, సురక్షితంగా తరలించేందుకు ఈ బెల్ట్ కన్వేయర్ వ్యవస్థ ఉపయోగపడుతుందని అధికారులు వివరించారు. సంప్రదాయ రవాణా విధానాలతో పోలిస్తే ఈ వ్యవస్థ ద్వారా బొగ్గు రవాణా వేగవంతమవడంతో పాటు సమయం, ఖర్చు తగ్గే అవకాశముందని తెలిపారు.ప్రాజెక్టు నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా కొనసాగాలని, భద్రతా నిబంధనలు పాటిస్తూ నిర్ణీత గడువులోపు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తిరుమలరావు సూచించారు. అనంతరం ఫ్యాబ్రికేషన్ యార్డును సందర్శించి ప్రాజెక్టుకు సంబంధించిన పరికరాల తయారీ విధానం, నాణ్యత ప్రమాణాలు, సాంకేతిక అంశాలను పరిశీలించారు. ప్రాజెక్టులకు అవసరమైన పరికరాల తయారీలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేశవరావు, ఆర్. శ్రీనివాస్, ఎం. శ్రీరమేష్, ఎస్.కే. కరీముల్లా, ఆర్.ఎస్. గౌడే, ఎన్. మధుసూదన్, సురేశ్, కే. శ్రీనివాస్, శోభన్ బాబు, డి.వి.ఎస్.ఎన్ ప్రవీణ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు ఆటో సౌకర్యం...!

- సామాజిక సేవలో దూసుకపోతున్న రాంబాబు
- సామాజిక కార్యకర్త తెలగమళ్ల రాంబాబు కు ప్రశంసలు




**నేలకొండపల్లి, మహా:**ఎర్రటి ఎండలో కిలో మీటర్ల దూరం పని కి వెళ్లాల్సి వస్తుంది...మధ్యాహ్నం ఇంటికి వచ్చే సమయంలో భగభగమండే ఎండ ను తట్టుకోలేక ఉపాధి కూలీలు అవస్థలు పడుతున్నారు...వారి బాధలను గుర్తించిన సామాజిక కార్యకర్త కూలీలకు అండగా నిలిచాడు..వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని బోదులబండ లో ఉపాధి హామీ పథకం పనులకు కూలీలు దాదాపు రెండు కిలో మీటర్ల దూరం వరకు వెళ్లాల్సి వస్తుంది. ప్రతీ రోజు ఎండకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గమనించిన స్థానిక సామాజిక కార్యకర్త తెలగమళ్ల రాంబాబు ఉపాధి కూలీలకు ఆటో సౌకర్యం కల్పించాలని నిర్ణయించుకున్నాడు అంతే... గ్రామానికి చెందిన ఆటోలను కూలీలను "పని వద్ద కు తీసుకెళ్లటం...పని తరువాత ఇంటికి తీసుకరావటం కోసం ప్రత్యేకంగా ఆటో సౌకర్యం కల్పించారు. ప్రతీ ఆటోకు రూ.200 చొప్పున చెల్లిస్తున్నాడు. సోమవారం రోజు ఆరు ఆటోలను ఏర్పాటు చేసి 60 మంది కూలీలను ఆటోల ద్వారా తరలించాడు. ఉపాధి కూలీలకు ఆటో సౌకర్యం కల్పించిన సామాజిక కార్యకర్త ను గ్రామస్తులు అభినందించారు. గ్రామంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ తనకంటే ప్రత్యేక స్థానం ను సంపాధించికుంటున్నారు. యువత ను ఐక్యం చేసి సామాజిక కార్యక్రమాలలో స్పీడ్ పెంచారు. డ్రగ్స్ రహీత సమాజం కోసం అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడారు... ఉపాధి కూలీల ఇబ్బందిని స్వయంగా చూశా.. ఎండలో వస్తున్న సమయంలో వారిని చూసి బాధ అనిపించింది. ఎంత ఇబ్బందైనా సరే... వారికి ఉపాధి పనులు అయ్యే వరకు ఆటో సౌకర్యం కల్పిస్తానని పేర్కొన్నారు. తన గ్రామస్తులకు సహాయం చేస్తున్నందుకు సంతోషంగా ఉంది.

## ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్



**జూలూరుపాడు, మహా:**ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పలు సంక్షేమ అభివృద్ధి పథకాలను పేదలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ కోరారు. మండల పరిధిలోని సాయిరాం తండా, వెంగన్నపాలెం గ్రామాలకు చెందిన బానోతు రుక్మిణి, నాగమణి ల ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో ఆయన సోమవారం పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొన్నారు. వైద్యశాలలో ప్రజలకు అందుతున్న వైద్య సదుపాయాలు గురించి అడిగ తెలుసుకున్నారు. వైద్యశాలకు కావలసిన వసతి సౌకర్యాల గురించి వైద్య శాఖ జిల్లా అధికారులతో మాట్లాడారు. అనంతరం మండల కేంద్రంలోనీ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో మండల స్థాయి అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు అందరూ భాగస్వాములు కావాలని, కార్యక్రమం పట్ల ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, సర్పంచ్ బానోతు సుమలత, ఉప సర్పంచ్ సిరంశెట్టి చిన్న సుబ్బారావు, మాజీ ఎంపీటీసీ దుద్దుకూరు మధుసూదన్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మాలోతు మంగీలాల్ నాయక్, ఓబీసీ జిల్లా అధ్యక్షులు అల్లాడి నరసింహారావు, గోపు రామకృష్ణ, దుద్దుకూరి సుమంత్, మహిళా నాయకురాలు ప్రియాంక, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

విద్యార్థులకు దుర్గం రామచందర్ సూచన




**మణుగూరు, మహా :** సింగరేణి బాలరాజ్ కంపెనీ ఆధ్వర్యంలో మణుగూరు ఏరియా పీవీ కాలనీలో ఉన్న సింగరేణి పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏరియా జీఎం హాజరయ్యారు. మరో అతిథిగా డీజీఎం పర్సనల్, పాఠశాల కరస్పాండెంట్ ఎస్ రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దుర్గం రామచందర్ మాట్లాడుతూ సింగరేణి పాఠశాలలు ఉన్నత ప్రమాణాల విద్యకు కేంద్రాలుగా నిలుస్తున్నాయని తెలిపారు. సింగరేణి యాజమాన్యం ప్రైవేటు పాఠశాలలకు సమానంగా విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తూ విజ్ఞాన దృక్పథం, సృజనాత్మకతను పెంపొందించే నాణ్యమైన విద్యను అందిస్తున్నదని పేర్కొన్నారు. సింగరేణి పాఠశాలల్లో చదివిన అనేక మంది విద్యార్థులు ప్రస్తుతం వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తూ ఉన్నత స్థానాలను అధిరోహిస్తున్నారని తెలిపారు. ఆ విజయాలను ఆదర్శంగా తీసుకుని ప్రస్తుత విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువులు కొనసాగించి పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. వంద శాతం ఉత్తీర్ణతతో పాటు అత్యుత్తమ గ్రేడ్లు సాధించి పాఠశాల ప్రతిష్ఠను మరింత పెంచాలని ఆకాంక్షించారు. సమయం విలువైనదని, దృష్టి మరల్చే అంశాలకు దూరంగా ఉండి చదువుపై పూర్తి దృష్టి పెట్టాలని విద్యార్థులకు సూచించారు.ఈ విద్యాసంవత్సరం పరీక్షలకు హాజరుకాబోయే విద్యార్థులతో పాటు వచ్చే సంవత్సరం పదో తరగతిలో ప్రవేశించనున్న విద్యార్థులు కూడా కృషితో చదివి జిల్లా, రాష్ట్ర స్థాయిలో మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలని, సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు హాల్ టికెట్లు, పరీక్షా సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్ కల్యాణి, ఉపాధ్యాయులు, ఉపాధ్యేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మా కార్యదర్శికి మేము అండగా ఉంటాము



**మహా దుమ్ముగూడెం:** కొత్త దంతెనం పంచాయితీ కార్యదర్శి బేక్కంటి మాధవికి గుండె సంబంధించిన చికిత్స కొరకు 20 లక్షలు రూపాయలు పైగా ఖర్చు అవుతుండడంతో కార్యదర్శి మాధవి కి మేము అండగా ఉంటామని కొత్త దంతెనం పంచాయతీ యువత ఆధ్వర్యంలో కొత్త దంతెనం సీతారాంపురం గ్రామస్తుల దగ్గర నుండి విరాళాలు సేకరించి మొత్తం 41200 రూపాయలు మరియు ఇంచార్జి కార్యదర్శి సాయి కృష్ణ 9000 సహాయం అందించగా మొత్తం 50200 రూపాయలు కొత్త దంతెనం పంచాయితీ సర్పంచ్ పొడియం సుబ్బారావు, ఉపసర్పంచ్ అనిత, మాజీ జడ్పీటీసీ అన్నే సత్యనారాయణ మూర్తి, ఇంచార్జి కార్యదర్శి సాయి కృష్ణ చేతుల మీదుగా ఎంపీడీఓ వివేక్ రామ్ గారి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో కొత్తదంతెనం పంచాయితీ యువత మోతుకూరి శ్రీకాంత్, మారెళ్ల వెంకటనారాయణ, వందవాసు రాము , సిద్ది మహేష్, కారంపూడి శ్రీను, పూజారి సందీప్, బొమ్మిడి హనుమంత్, కొత్త అచ్చుత రావు, కొత్త నర్సింహ రావు, జల్లవరపు చలమయ్య, అల్లాడి సజీవ్, బొల్లోజు బాలమురళి, కొత్త ఏసుదాసు, కొత్త వెంకటనర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సర్పంచులకు ఘనంగా సన్మానం



**మహా దుమ్ముగూడెం:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని దుమ్ముగూడెం మండల ఆదివాసి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో దుమ్ముగూడెం మండల మహిళా సర్పంచులను సోమవారం ఘనంగా సన్మానించారు. లక్ష్మీనగరం మండల పరిషత్ సమావేశ మందిరంలో సరియం కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో ఆదివాసి సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ నాయకులు, ఎంపీడీవో వివేక్ రామ్ లతో కలిసి మహిళా సర్పంచులకు సాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆదివాసి సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ నాయకులు మాట్లాడుతూ అవనిలో సగమైన మహిళలను గౌరవించాలని అన్నారు. అమ్మకు నిర్వచనమే మహిళ అని మహిళలేనిది ఈ విశ్వమే లేదని ఈ సృష్టి లేదని అన్నారు. నూతనంగా ఎన్నికైన మహిళా సర్పంచులు మహిళల హక్కుల కోసం పోరాడాలని మహిళలకు వచ్చే సమస్యలపై సర్పంచులు ఐక్యంగా నిలబడి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అన్నారు. గ్రామపంచాయతీలో ప్రదం పౌరులుగా ఎన్నికైన మహిళలు అర్హులైన వారు ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తూ గ్రామాలలో సమస్యలను పరిష్కరిస్తూ ప్రజలకు జావతారీతనంతో నడుచుకోవాలని విజ్ఞప్తి చేశారు .మండల కార్యాలయం వరకు పటిష్టమైన రోడ్డు నిర్మించాని, లక్ష్మి నగరం ములకపాడులో బస్టాండ్ లు నిర్మించాలాని తదితర సమస్య లు పరిష్కరించాలని ఎంపీ డీ ఓ వివేక్ రామ్ మెమో రాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొమరం దామోదర్ రావు, కుంజ శ్రీనివాస్ రావు, సోయం కామరాజు, సరియం కోటేశ్వరరావు, ముర్రం. వీరభద్రం, ఉబ్బ. వేణు,కనీతి సమ్మయ్య, కొమరం. చంటి, సర్పంచులు సంఘం అధ్యక్షులు మట్టా. వెంకటేష్, ఉపాధ్యాక్షులు సరియం. రాజమ్మ, కార్యదర్శి. శ్యామల రవివర్మ, సహాయ కార్యదర్శి వాగే ఖాదర్ బాబు కోశాధికారి ముర్రం విజయం విజయశ్రీ, వివిధ గ్రామ పంచాయతీల సర్పంచ్ లు పాల్గొన్నారు..

## పశుసంవర్ధక రంగంలో రైతుల ఆదాయం పెంపొందించే అవకాశాలు




**రాజేంద్రనగర్ మహా ;** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ రాజేంద్రనగర్ లో వ్యవసాయ ప్రదర్శన రైతు మేళా కార్యక్రమం రెండు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పీవీ, నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ తరఫున ప్రత్యేక వెటర్నరీ స్టాల్ ఏర్పాటు చేసి, రైతులకు పశుసంవర్ధక రంగంలోని ఆధునిక సాంకేతికతలను తెలిపారు. ఈ వెటర్నరీ స్టాల్స్ రైతులకు పౌల్ట్రీ నిర్వహణ పద్ధతులు, పశువులలో సమతుల ఆహారం, మరియు ఖనిజ మిశ్రమాల ప్రాముఖ్యత, పాలు, మాంసం ఉత్పత్తుల విలువ పెంపు విధానాలు వివిధ రకాల గడ్డి జాతుల సాగు పశువుల ఆరోగ్య సంరక్షణ మరియు ప్రజారోగ్యంపై అవగాహన కల్పించారు. విశ్వవిద్యాలయం ఫామ్స్ నుండి తీసుకువచ్చిన గొర్రెలు, మేకలు, కుందేళ్ళు, పెరటి కోళ్లు మరియు కంజు పిట్టలు ప్రదర్శించి రైతులకు వాటి పెంపకం ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశాలను వారికి వివరించారు. స్టాల్స్ ని విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ కిషన్ కుమార్ కళాశాల అసోసియేట్ డిన్ డాక్టర్ మాధురి ప్రదర్శన సందర్శించి పరిశీలించారు. రైతులతో పశు సంవర్ధక రంగంలో శాస్త్రీయ పద్ధతులను అనుసరించడం ద్వారా రైతులు తమ ఆదాయాన్ని పెంచుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయానికి చెందిన వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు, డాక్టర్లు రాజన్న, సిహెచ్ రామకృష్ణ, స్వాతి, జగదీష్, హనుమంతురావు, శ్రీలత, పురుషోత్తం నాయక్, సురేష్‌నాయక్లు రైతుల సందేహాలను నివృత్తి చేశారు.

## మిలియన్ మార్చ్ కు అధిక సంఖ్యలో తరలిరావాలి

ఉద్యమకారుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు



**నేలకొండపల్లి, మహా:**తెలంగాణ అమరువీరుల ను స్మరించుకునేందుకు మంగళవారం హైద్రాబాద్ లో తలపెట్టిన చలోగన్పార్క్ ను విజయవంతం చేయాలని ఉద్యమకారుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు మాదాసు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం గ్రేట్ మిలియన్ మార్చ్ డే పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... మిలియన్ మార్చ్ లో గ్రామా గ్రామానా పెద్ద సంఖ్యలో తరలిరావాలని సూచించారు. గ్రేట్ మిలియన్ మార్చ్ డే విజయవంతం చేసి తెలంగాణ అమరవీరుల ను స్మరించకుందామని పేర్కొన్నారు. తెలంగాణ హక్కుల దినంగా పాటించేందుకు ప్రతీ ఉద్యమకారులు అమరువీరుల స్థూపం వద్ద కు తరలిరావాలని కోరారు. ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం క్షేత్ర స్థాయిలో ఉద్యమాలకుసిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల జేఏసీ నాయకులు తీగ రాములు, మందడి వెంకటేశ్వరరావు, జీ.అంజి, ఎస్.యాకయ్య, కె.కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా హైడ్రోపోనిక్ గంజాయి పట్టివేత



**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో 3 కోట్లు విలువ చేసే, 9 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కౌలాలంపూర్ నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయికి వచ్చిన ఇద్దరు ప్రయాణికుల కదలికలపై కస్టమ్స్ అధికారులకు అనుమానం కలగడంతో వారి లగేజ్ ని క్షుణ్ణంగా తనిఖీ చేయగా సుమారు 9 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని గుర్తించారు.గంజాయి విలువ సుమారురూ 3 కోట్ల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు.కస్టమ్స్ అధికారులు ఇద్దరు ప్రయాణికులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా, ప్రజల సౌకర్యార్థం అన్ని హంగులతో సిద్ధం కానున్న తాసిల్దార్ కార్యాలయం

ఎమ్మార్వో కార్యాలయాన్ని సందర్శించిన డిప్యూటీ కలెక్టర్ చంద్రారెడ్డి



**రాజేంద్రనగర్ మహా ;** ఎమ్మార్వో కార్యాలయానికి ప్రజలు తమ పని మీద వస్తుంటారు.వారి సౌకర్యార్థం ఎమ్మార్వో కార్యాలయంలో అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. సోమవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి, ఆర్డిఓ వెంకట్ రెడ్డి తో కలిసి శంషాబాద్ లోని ఎమ్మార్వో కార్యాలయంతో పాటు పరిసరాలను సందర్శించారు. ప్రజలకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండే విధంగా ఎమ్మార్వో కార్యాలయానికి తుదిమెరుగులు దిద్దాలన్నారు. సౌచాలయాలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి, ఎమ్మార్వో కార్యాలయానికి నూతన పెయింట్ వేసి పార్కింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. తాగునీటి సమస్య లేకుండా చూడాలి. పెండింగ్లో ఉన్న పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. కార్పొరేట్ వ్యవస్థకు దీటుగా ఎమ్మార్వో కార్యాలయం ఉండాలన్నారు. కావలసిన నిధులు కలెక్టర్ కార్యాలయం అందిస్తుందన్నారు. వారంలో మరోసారి వస్తాను అంతలోపల నూతన ఎమ్మార్వో కార్యాలయముగా కనిపించాలని ఎమ్మార్వో రవీందర్ దత్ కు సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ ఫైళ్లను త్వరగా పరిష్కరించాలి

- ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులను కొనసాగిస్తూ..
- పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి సారించాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి



**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ జోనల్ కార్యాలయంలో ఉన్న పెండింగ్ ఫైళ్లను సత్వరంగా పరిష్కరించాలి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులను కొనసాగిస్తూ పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ నారాయణ రెడ్డి సూచించారు. శంషాబాద్ జోన్ పరిధిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని సోమవారం కలెక్టర్ నారాయణరెడ్డి పరిశీలించారు. శంషాబాద్ జోన్ పరిధిలోని కమ్యూనిటీ హాల్ బస్తిదావకానకు వచ్చే రోగులకు అందించే వైద్యం మందుల, వివరాలు, చేస్తున్న రక్త పరీక్షలు, అందిస్తున్న వైద్య సేవలు, డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మందుల కోసం బస్తి దవాఖానకు వస్తున్న రోగులతో మాట్లాడి అందిస్తున్న చికిత్స ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు నిర్వహించిన వివరాలు రిజిస్టర్లో నమోదు చేశారా లేరా అనే విషయాన్ని సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. వివరాలు నమోదులో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని సూచించారు. జూన్ 12వ తేదీ వరకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలి. గ్రామ,మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయిలలో 99 రోజులపాటు కార్యచరణ అమలు చేయాలన్నారు. పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. శంషాబాద్ జోన్ పరిధిలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్లో ఉన్న ఫైళ్లను సత్వరంగా పరిష్కరించాలన్నారు. అధికారులు వారి వారి పరిధిలోని అంశాలపై ప్రణాళికలు సిద్ధం చేసి దశలవారీగా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పనులు పక్కాగా అమలు చేయాలి. పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి సారించి, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలి, ప్రభుత్వ కార్యాలయంలో అవసరమైనచోట మరమ్మత్తులు పెయింటింగ్, పనులు ఉంటే పూర్తి చేయాలి. ఎలాంటి నిర్లక్ష్యానికి తాగు లేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు.ప్రతి రోజు సేకరించిన తడి, పొడి చెత్తను సెగ్రిగేషన్ కేంద్రాలకు తరలించాలి. నీటి నిల్వలు లేకుండా దోమలు వృద్ధి చెందకుండా పరిషరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ నారాయణ రెడ్డి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ చంద్రకళ, ఆర్డిఓ వెంకట్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి లలితాదేవి, డిప్యూటీ కమిషనర్ సుమన్ రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బస్తి దవాఖానలో సరైన వైద్యం అందించాలి

- రోగుల వివరాల రిజిస్టర్ లో నమోదు తప్పనిసరి
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:**ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులను కొనసాగిస్తూ కార్యాలయాలలో పెండింగ్ ఫైళ్లను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లాలోని శంషాబాద్ మున్సిపల్ పరిధిలో చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శంషాబాద్ లోని మున్సిపల్ కమ్యూనిటి హాల్ ను, బస్తి దవాఖాను సందర్శించి ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అక్కడ చేపట్టిన పనులను పరిశీలించారు. బస్తీ దవాఖానకు వచ్చే వారికి అందిస్తున్న వైద్యం వివరాలు, మందుల వివరాలు డాక్టర్లను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బస్తీ దవాఖానలో చేస్తున్న రక్త పరీక్షలు, అందిస్తున్న వైద్య సేవలు, మందుల గురించి దవాఖానకు వచ్చిన వారిని అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు నిర్వహించిన వివరాలు రిజిస్టర్ నందు నమోదు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రతగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జూన్ 12వ తేదీ వరకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలలో 99 రోజుల పాటు కార్యచరణ అమలు చేయాలని, పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ లో ఉన్న ఫైళ్లను పూర్తిగా పరిష్కరించాలని తెలిపారు. ప్రభుత్వ శాఖల అధికారులు వారి పరిధిలోని అంశాలపై ప్రణాళికలు సిద్ధం చేసి దశల వారీగా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలోని ప్రతి కార్యాలయంలో ప్రజపాలన ప్రగతి ప్రణాళిక పనులు పక్కాగా అమలు చేయాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, ప్రతి కార్యాలయంలో అవసరమైన చోట ఏమైనా మరమ్మత్తులు, పెయింటింగ్ పనులు ఉంటే పూర్తి చేయాలని, ఎక్కడ ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని సూచించారు. రోజు వారీగా సేకరించిన తడి, పొడి చెత్తను సెగ్రిగేషన్ కేంద్రాలకు తరలించాలని, నీటి నిల్వలు లేకుండా, దోమలు పెరగకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్ వెంట శంషాబాద్ మున్సిపల్ జోనల్ కమిషనర్ చంద్రకళ, రాజేందర్ నగర్ ఆర్డీఓ వెంకట్ రెడ్డి, శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి లలితా దేవి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 99 ఫిర్యాదులు అందాయి

- ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి
- సంబంధిత అధికారులకు ఆదేశాలు
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:**ప్రజావాణి అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రా రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులుఅందజేసిన అర్జీలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రా రెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో కలసి స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ -19, ఇతర శాఖలకు -80, మొత్తం 99 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో అభివృద్ధి పనులను, పెండింగ్ ఫైళ్లను పరిష్కరించాలి

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మందమర్రి, మహా :** మంచిర్యాల జిల్లాలో వివిధ అభివృద్ధి పనులను, పెండింగ్ ఫైళ్లను వీలైనంత త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. సోమవారం క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులను కొనసాగిస్తూ కార్యాలయాలలో పెండింగ్ ఫైళ్లను త్వరగా పరిష్కరించాలని ఆయన వెల్లడించారు. ఈ కార్యచరణ జూన్ 12 వరకు ఉంటుందని, క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని ఆయన తెలిపారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో 99 రోజుల పాటు కార్యచరణ చేసినట్లు వెల్లడించారు. పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టితో పాటు ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ లో ఉన్న ఫైళ్లను పూర్తిగా పరిష్కరించాలని తెలిపారు. ప్రభుత్వ శాఖల అధికారులు వారి పరిధిలోని అంశాలపై ప్రణాళికలు సిద్ధం చేసి దశల వారీగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో, కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేలా చర్యలు చేపట్టాలని అన్నారు.వేసవి కాలం దృష్ట్యా త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు.

# తాగునీటి సమస్య రాకుండా కలిసికట్టుగా కృషి చేద్దాం..

## నంబర్ వన్ గా నిలవాలి.. రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**కరీంనగర్ మహా:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలులో చిగురుమామిడి సైదాపూర్ మండలాలను నంబర్ వన్‌గా నిలపాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఎక్కడా తలెత్తకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి సైదాపూర్ మండలాల్లో జరిగిన సన్నాహక సమావేశాలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇందులో జిల్లా మండల స్థాయి అధికారులు ఆయా మండలాల సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా





పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం గొప్ప కార్యక్రమం అని దీంతో గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవచ్చని పేర్కొన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. వేవంతంగా పనులు పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరఫరా చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. గ్రామాల్లో పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. విద్యార్థులను ప్రైవేటు పాఠశాలలకు పంపని గ్రామాల్లో ఎంత పెద్ద పనైనా చేసి పెడతానని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ అధికారుల మందిరము సమిష్టిగా కృషి చేసి కరీంనగర్ జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని సక్సెస్ చేస్తామని పేర్కొన్నారు. గ్రామాల వారీగా పంచాయతీ కార్యదర్శులు మండల అధికారులు తాగునీటి సమస్య రాకుండా మిషన్ మోడ్ లో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, ఆర్డీవో కే మహేశ్వర్ డిపిఓ జగదీశ్వర్ డి ఆర్ డి ఓ శ్రీధర్ జిల్లా వైద్యాధికారి వెంకట రమణ సంక్షేమ అధికారి సరస్వతి హౌసింగ్ పిడి శ్రీనివాస్ స్పెషల్ ఆఫీసర్లు, వివిధ శాఖల జిల్లా మండల స్థాయి అధికారులు సర్పంచులు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# కంది శ్రీనివాస రెడ్డి పరామర్శలు





**ఆదిలాబాద్ మహా :** బాధలో దుఃఖం లో ఉన్న వారిని పరామర్శించి కొండంత భరోసానిస్తారు ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి . తలమడుగు మండలం బరంపూర్ కు చెందిన మాజీ డీసీసీబీ బ్యాంకు చైర్మన్ ముడుపు దామోదర్ రెడ్డి తండ్రి ముడుపు భూమారెడ్డి పెద్దకర్మ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు.భూమారెడ్డి చిత్రపటానికి పూలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్గీయ భూమారెడ్డి అజాత శత్రువు అని కొనియాడారు. నిరంతరం గ్రామం ప్రజలు కుటుంబం మేలు కోరే వ్యక్తి అన్నారు. నీతి నిజాయితీతో బరంపూర్ భూమా రెడ్డిగా మంచి పేరుతెచ్చుకున్నారన్నారు. ఎవరితో వైరం లేకుండా అందరినీ కలుపుకు పోయే తత్వమున్న మంచి మనిషి ఆయన లేని లోటు తీర్చలేనిదన్నారు. ఆయన కుమారులకు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానన్నారు. అనంతరం మావల మండలం వాఘాపూర్ గ్రామాన్ని సందర్శించారు. గ్రామానికి చెందిన గడ్డం జీవన్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసారు.

# చర్లపల్లి పారిశ్రామిక వాడల్లో చిన్న పరిశ్రమల అభివృద్ధికి ప్రోత్సాహం

## ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**కుషాయిగూడ, మహా :** చర్లపల్లి పరిశ్రమల సంఘం ఆధ్వర్యంలో చర్లపల్లి ఐడీఏ ఫేజ్ -2లో నిర్వహిస్తున్న ఆరవ పారిశ్రామిక ప్రదర్శన కార్యక్రమాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ పారిశ్రామిక స్టాళ్లను సందర్శించి పరిశ్రమల కార్యకలాపాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్న, మధ్య తరహా పరిశ్రమలు అభివృద్ధి చెందడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఇటువంటి ప్రదర్శనలు నిర్వహించడం ద్వారా స్థానిక పరిశ్రమలకు ప్రోత్సాహం లభిస్తుందని, కొత్త వ్యాపార అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. పరిశ్రమలు అభివృద్ధి చెందితే యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా టీఐఎఫ్ అధ్యక్షులు కె. సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. చర్లపల్లి పరిశ్రమల సంఘం అధ్యక్షులు డి. శ్రీనివాస రెడ్డి, కార్యదర్శి పీ.ఎస్. మోహన్ జక్క రోషి రెడ్డి కట్టంగూరు హరీష్ రెడ్డి మాజీ అధ్యక్షులు గోవిందరెడ్డి జలంధర్ రెడ్డి మిరపల గోపాలరావు తదితరులు కార్యక్రమాన్ని



నిర్వహించారు. ఐలా మాజీ చైర్మన్ కట్టంగూరు హరీష్ రెడ్డి మాట్లాడుతూ చర్లపల్లి పారిశ్రామిక వాడల్లో ఎగ్జిబిషన్లు నిర్వహించడం వల్ల చిన్న పరిశ్రమలకు మంచి గుర్తింపు వస్తుందని అన్నారు ఇలాంటి అడ్మిషన్లు ప్రతి ఏటా నిర్వహిస్తామని హరీష్ రెడ్డి తెలిపారుబీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, కాసం మహిపాల్ రెడ్డి, పలువురు పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, సంఘ సభ్యులు మరియు స్థానిక ప్రముఖులు ఈ ప్రదర్శనలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం పరిశ్రమల ప్రోత్సాహానికి దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

# బీఎల్ఆర్ టారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంబీబీఎస్ విద్యార్థులకు చెక్కులు అందించిన మంత్రి దామోదర రాజనర్సింహా

**కుషాయిగూడ, మహా :** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ఎంబీబీఎస్ చదివే విద్యార్థులకు, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వారి వైద్య విద్యకు అయ్యే ఫీజును ఆరోగ్య శాఖ మంత్రి సి. దామోదర్ రాజనర్సింహ చేతుల మీదుగా చెక్కులను అందజేశారు. బంజారాహిల్స్ లోని మంత్రి నివాసంలో ఎంబీబీఎస్ విద్యార్థులకు చెక్కుల ద్వారా రూ. 10 లక్షల చెక్కులు అందజేశారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బిఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎన్నో ఏళ్లుగా పేద విద్యార్థులకు ఫీజులు చెల్లించడం పై ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డిని దామోదర్ రాజనర్సింహ అభినందించారు ఎంబీబీఎస్ చదివే విద్యార్థులు డాక్టర్లు అయ్యాక వైద్య సేవలు అందించి ప్రజల మనసును గెలుచుకోవాలని మెడికల్ విద్యార్థులకు దామోదర్ రాజనర్సింహ సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జేరిపోతుల ప్రభుదాస్, బీఆర్ఎస్ నాయకులు గంధం నాగేశ్వర్ రావు ,చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు నేమూరి మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు



# సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్

## ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి- కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా :** నియోజక వర్గ ప్రజలకు ఎప్పుడు ఏ అవరమొచ్చినా తాను అండగా ఉంటానని వారి సమస్యల పరిష్కారం కోసమే ప్రతీ వారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం పట్టణం లోని తన క్యాంపు కార్యాలయం ప్రజా సేవ భవన్ లో ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కు ఆయన హాజరయ్యారు.నియోజకవర్గంలోని పలు ప్రాంతాలనుండి తరలివచ్చిన ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజాదర్బార్ లో తమ సొంత సమస్యలు , గ్రామ సమస్యలు, వార్డు, కాలనీల సమస్యలను కంది శ్రీనివాస రెడ్డి దృష్టికి తెచ్చారు. తమ సమస్యల పై ఆయనకు దరఖాస్తులు సమర్పించారు. ప్రజాదర్బార్ లో ఏర్పాటు చేసిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అప్లికేషన్ల డాటాను ఎప్పటికప్పుడు భద్రపరిచి క్లీయరెన్స్ అప్డేట్ తెలుసుకునే అవకాశముందన్నారు.ఆయా సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ పరిష్కారం కోసం శాయ శక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ సంతోష్ రావు కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు వివిధ గ్రామాల నుండి తరలివచ్చిన ప్రజలు పాల్గొన్నారు.



# కలెక్టర్ కు మెమోరండం అందజేసిన ఉద్యమకారులు

## ఉద్యమకారులను గుర్తించాలని వినతి

**భువనగిరి, మహా :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆనాటి సమైక్య పాలకులు ఎన్ని కేసులు పెట్టినా ఆనాటిసమైక్య పాలకులు పోలీసుల తోటి రబ్బర్ బుల్లెట్ల తోటి భాష వాయువు లాటీలు తూటాలకు బెదరకుండా జైలు నిర్బంధాలను ఎదిరించి రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమకారులకు న్యాయం చేయాలని వెంటనే హైకోర్టు ఇచ్చిన తీర్పు అమలు చేయాలని సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతిని కలసి మెమోరండం అందజేశారు ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు సంగిశెట్టి క్రిస్టఫర్ సంగిశెట్టి జనార్ధన్ గడ్డమీది పరశురాములు కొండ కింది నరేందర్ మందడి రవీందర్ రెడ్డి చిందం ప్రకాష్ తదితరులు కలెక్టర్ కు వినతి మెమో రండం అందజేశారు



# మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఘన సన్మానం



**ఆలేరు, మహా:**అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆలేరు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మహిళా ప్రజాప్రతినిధులు, మహిళా ఉద్యోగులు, రిసోర్స్ పర్సన్‌లు (ఆర్‌పీలు) మహిళా పారిశుద్ధ్య కార్మికులను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బిజన బాలమణి భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, ప్రతి రంగంలోనూ మహిళలు ప్రతిభ కనబరుస్తూ ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలపడితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆమె అన్నారు. మున్సిపల్ కమిషనర్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీలో సేవలందిస్తున్న మహిళా ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులు నగర పరిశుభ్రత మరియు అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. మహిళల కృషిని గుర్తిస్తూ ఇలాంటి సన్మాన కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కోమల్ల మౌనిక, వనరసి మరియమ్మ, బిజన కళ్యాణి, మల్లెల సరిత, జట్ట నీరజ, యాట శివ, పాశికంటి సంపత్, జూకంటి సంపత్ తదితరులు పాల్గొన్నారు.అలాగే మున్సిపల్ సిబ్బంది, రిసోర్స్ పర్సన్‌లు (ఆర్‌పీలు) మరియు మహిళా పారిశుద్ధ్య కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.కార్యక్రమం ముగింపులో మహిళలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి సేవలను అభినందించారు

# డివైడర్ ను ఢీకొని వ్యక్తి మృతి

**మందమర్రి, మహా :** మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో డివైడర్ ను ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. మందమర్రి ఎస్సై గోపతి నరేష్ కథనం ప్రకారం మంచిర్యాలకు పట్టణానికి చెందిన బర్ల శంకర్ (64), తన భార్య రాజేశ్వరితో కలిసి ద్విచక్ర వాహనం (TS 19 F 9608) పై నెన్నెల వైపు వెళుతున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో మందమర్రి హైవే రోడ్డు నంబర్ 363 పై ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్ రెయిలింగ్‌ను ఢీ కొట్టిందని తెలిపారు. ఈ ప్రమాదంలో బర్ల శంకర్ తలకు తీవ్ర గాయమై తాను అక్కడికక్కడే మృతి చెందారని పేర్కొన్నారు. వెనుక కూర్చున్న ఆయన భార్య రాజేశ్వరికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని స్పష్టం చేశారు. మృతుడి కుమారుడు బర్ల కార్తీక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు



# నిర్ణీత గడువులో ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మహా :** నిర్ణీత గడువులో ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రావు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ కు అర్జీదారులు పెట్టుకున్న సమస్యలు ఇలా ఉన్నాయి. తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఇరవేని రాయమల్లు తన భూమికి సంబంధించి పాత పట్టాదారు పాసుపుస్తకం ఉందని, నూతన పట్టా పాసు పుస్తకం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన దుర్గం మల్లేష్ తనకు సమీకృత కూరగాయల మార్కెట్ లో కేటాయించిన దుకాణాన్ని కొందరు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కన్నేపల్లి మండల కేంద్రానికి చెందిన బోయ పోచం తనకు పూర్వీకుల నుండి వస్తున్న భూమిని కొందరు అక్రమంగా ఆక్రమించుకున్నారని, ఈ విషయమై విచారించి తనకు న్యాయం చేసి పట్టాదారు పాసుపుస్తకాలు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆల్ ఇండియా ఎస్.సి./ఎస్.టి. ఐక్యవేదిక ప్రతినిధి పెరుగు తిరుపతి తన దరఖాస్తులో లక్షెట్టిపేట మండలం ఉత్కూరు చౌరస్తాలో గురువారం జరుగుతున్న వారసంతను వ్యవసాయ మార్కెట్ యార్డు ఏరియాకు మార్చాలని కోరారు. రా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధి గుంట నాగరాజు తన దరఖాస్తులో డిఫాల్ట్ మిల్లర్లకు విధించిన 25 శాతం జరిమానా, 12 శాతం వడ్డీ మాఫీ చేసి ప్రభుత్వం నుండి రావలసిన బకాయిలను ఇప్పించాలని కోరారు. వేమనపల్లి మండలం జిల్లెడ గ్రామానికి చెందిన పొలంపల్లి మల్లయ్య, పొలంపల్లి మధునయ్యలు తమకు వారసత్వంగా సంక్రమించిన



ఆస్తిని పెద్దమనషుల సమక్షంలో పాలి పంపకం చేసుకున్నామని, తమ వాటాకు వచ్చిన భూమిని కొందరు ఒప్పందాన్ని ఉల్లంఘించి రిజిస్ట్రేషన్ చేసుకున్న ఘటనపై తగు విచారణ జరిపి, అట్టి రిజిస్ట్రేషన్ ను రద్దు పరచి న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండలం రంగపేట గ్రామానికి చెందిన దుర్గం సుమన్ తనతోపాటు మరి కొంతమంది రైతులకు షెడ్యూల్డ్ కులాల సహకార సంస్థ నుండి బోర్ పాయింట్ గుర్తించి బోర్ చేయడం జరిగిందని, ఇట్టి బోరులకు విద్యుత్తు లైన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.

**12 మార్చి నాడు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశం**

మార్చి 12 నాడు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశం నిర్వహించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. ఈ సమావేశానికి గ్రామ పంచాయతీలలోని సర్పంచ్, ఉపసర్పంచ్, మున్సిపల్ కార్పొరేషన్, మేయర్, చైర్ పర్సన్, డిప్యూటీ మేయర్, వైస్ చైర్ పర్సన్ లు సిద్ధంగా ఉండాలని వెల్లడించారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తమ శాఖ పరిధిలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాల పురోగతి, ఆయా పథకాల ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారులకు సంబంధించి గ్రామాలు, డివిజన్లు,వార్డుల వారీగా పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. సి.ఎం. కప్ 2025 లో భాగంగా గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలను పూర్తి చేసుకుని రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీలలో జిల్లా నుంచి పాల్గొని బ్యాడ్మింటన్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను పతకాలు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి...

## జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**యాదాద్రి భువనగిరి, మహా:** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 46 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 24,గ్రామీణాభివృద్ధి శాఖ 5 మున్సిపాలిటీ 4,హౌసింగ్ 2, సూపరిండెంటెంట్ ఆఫ్ పోలీస్ 2 డివిజనల్ పంచాయతీ 2 సర్వే ల్యాండ్,జిల్లా సంక్షేమ , యస్ డి సి, ఈ ఈ ఇరిగేషన్, ఆర్ టి సి, విద్యా, రోడ్లు, భవనాలు శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ సి.ఈ.ఓ శోభ రాణి గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ANN
Scan here.
Step Forward. Get Recognized. Be Celebrated.

# దాతర్ పల్లి చెరువులో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రత్యేక పూజలు

**యాదగిరిగుట్ట, మహా:**యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం దాతర్ పల్లి గ్రామంలోని పెద్దచెరువు గోదావరి జలాలతో నిండి అలుగు పోస్తుంది ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ఎండాకాలంలో రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలుగా ఆలేరు నియోజకవర్గంలోని చెరువులను గోదావరి జలాలతో నింపుతున్నామని తెలిపారు.మల్లన్న సాగర్, కొండపోచమ్మ,నావబ్ పేట, రిజర్వాయర్, తపాస్ పల్లి ప్రాజెక్టుల నుండి అవకాశం ఉంటే ఆలేరు నియోజకవర్గం లోని అన్ని చెరువులు నింపడం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. రైతులకు సంవత్సరం పొడవునా సాగునీరు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు.అలాగే చెరువులు నిండడంతో భూగర్భ జలాలు పెరిగి రైతులకు, ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. గ్రామ ప్రజలు చెరువులను సంరక్షించుకొని నీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.



# ముస్లిం సోదరీమణులకు రంజాన్ తోఫా అందజేసిన బీర్ల పౌండేషన్

**ఆలేరు, మహా:**యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులోని వై ఎస్ ఆర్ గార్డెన్ లో సోమవారం బీర్ల ఫౌండేషన్ సౌజన్యం తో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం కుటుంబాలకు ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ,బీర్ల ఫౌండేషన్ చైర్ పర్సన్ అనితలు ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా కిట్స్ అందజేసారు. అలాగే రాష్ట్ర మహిళ కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి చొరవతో దాత నవాబ్ సేక్ ఇబ్రాహీం 200 ముస్లిం కుటుంబాలకు తోఫా అందించారుఈ సందర్భంగా బీర్ల అయిలయ్య అనిత మాట్లాడుతూ రంజాన్ మాసం ముస్లిం సోదరులకు ఎంతో పవిత్రమైనది. ఉపవాసాలు, ప్రార్థనలు చేసి అల్లాహ్ కృప కోసం ప్రార్థించే పవిత్ర సమయం అన్నారుమన తెలంగాణ రాష్ట్రంలో అన్ని మతాలు, అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి సౌభ్రాతృత్వంతో జీవించడం ఎంతో గర్వకారణం.ముస్లిం సోదరుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతోంది. రంజాన్ సందర్భంగా తోఫా పంపిణీ కూడా అందులో భాగం.ముస్లిం కుటుంబాలు రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో బీర్ల ఫౌండేషన్ సౌజన్యం తో ఈ తోఫా పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నాం.ముస్లిం సోదరులకు ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. అల్లాహ్ ఆశీస్సులు మీ అందరికీ ఉండాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జనగామ ఉపేందర్ రెడ్డి, నీలం పద్మ, మున్సిపల్ చైర్మన్ బీజన బాలమణి భాస్కర్, వైస్ చైర్మన్ అంగడి ఆంజనేయులు, కౌన్సిలర్లు జెట్ట నీరజ, మల్లెల సరిత,మరియమ్మ,జూకంటి సంపత్,అస్రం ఆంజనేయులులతో పాటు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఎంఏ ఎజాజ్ తదితరులు పాల్గొన్నారు.



# 30వేల ఉద్యోగుల తొలగింపు?




2026లో ప్రముఖ కంపెనీలెన్నో తమ ఉద్యోగులను తొలగించాయి. ఇలాంటి సమయంలో టెక్ మహీంద్రా కంపెనీ కూడా ఒకేసారి 30వేల మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు కొన్ని వార్తలు తెరపైకి వచ్చాయి. దీనిపై సదరు కంపెనీ స్పందించింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని, కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు ఇచ్చిన అధికారిక ప్రకటనలో స్పష్టం చేసింది. సోషల్ మీడియాలో వచ్చిన పోస్టులు.. కేవలం తప్పుదారి పట్టించే వదంతులేనని పేర్కొంది. మార్కెట్‌లో అనవసర గందరగోళం రాకుండా.. ఉండేందుకు ఈ విషయంపై క్లారిటీ ఇచ్చినట్లు తెలిపింది. టెక్ మహీంద్రా కంపెనీ ఏజెంటిక్ ఏఐ ప్లాట్‌ఫామ్‌ను తీసుకొచ్చేందుకు మైక్రోసాఫ్ట్‌తో కలిసి పనిచేసేందుకు భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఆ తరువాత లేఆఫ్స్ ప్రచారం తెరమీదకు వచ్చింది. అయితే ప్రస్తుతం ఈ విషయంపై కంపెనీ క్లారిటీ ఇచ్చేసింది. కాగా.. టెక్ మహీంద్రా త్రైమాసిక గణాంకాల ప్రకారం కంపెనీలో ప్రపంచవ్యాప్తంగా సుమారు 1.5 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఏఐ కారణంగానే ఉద్యోగులను తొలగించనున్నట్లు సోషల్ మీడియాలో పేర్కొంటున్నారు. దీనికి ప్రధాన కారణం ప్రపంచవ్యాప్తంగా టెక్నాలజీ కంపెనీలు AI ఉపయోగాన్ని పెంచుతున్న నేపథ్యంలో ఉద్యోగాలపై ప్రభావం పడవచ్చనే భావన అని తెలుస్తోంది. అయితే టెక్ మహీంద్రా భారీ స్థాయి ఉద్యోగాల కోత గురించి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని వెల్లడించింది.

# 2026 హ్యుందాయ్ వెర్నా: ధర ఎంతంటే?




హ్యుందాయ్ మోటార్ ఇండియా.. 2026 వెర్నాను రూ. 10.98 లక్షల ప్రారంభ ఎక్స్‌షోరూమ్ ధరకు దేశీయ మార్కెట్లో లాంచ్ చేసింది. ఈ సెడాన్ అప్డేటెడ్ ఎక్స్టీరియర్, ఇంటీరియర్ పొందుతుంది. ఆరు వేరియంట్లలో లభించే ఈ కారు.. మాన్యువల్ & ఆటోమేటిక్ గేర్‌బాక్స్‌లతో జత చేసిన రెండు 1.5లీటర్ పెట్రోల్ ఇంజన్ ఎంపికలతో అందుబాటులో ఉంటుంది. ఇది క్లాసీ బ్లూ, టైటాన్ గ్రే మాట్టే అనే రెండు రంగుల్లో లభిస్తుంది. 2026 వెర్నాలో ఇప్పుడు బ్లాక్ క్రోమ్ రేడియేటర్ గ్రిల్, డ్యూయల్ ఎల్ఈడీ ప్రొజెక్టర్ హెడ్‌ల్యాంప్‌లు, రీడిజైన్ చేసిన బంపర్లు & 16 ఇంచెస్ డైమండ్ కట్ అల్లాయ్ వీల్స్ ఉన్నాయి. ఫీచర్స్ విషయానికి వస్తే.. ఇందులో డ్రైవర్ సీటు కోసం మెమరీ ఫంక్షన్, కోడ్రైవర్ సీటు కోసం ఎలక్ట్రిక్ వాక్ఇన్ పరికరం, వెనుక విండో సన్‌షేడ్, డాష్‌క్యామ్, ఏడు ఎయిర్‌బ్యాగ్‌లు ఉన్నాయి. సరౌండ్‌వ్యూ కెమెరా, లెవల్ 2 ADAS సూట్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, బోస్ స్పీకర్ సౌండ్ సిస్టమ్ & బ్లైండ్ స్పాట్ మానిటర్ వంటి ఇతర ఫీచర్లు ఆఫర్‌లో ఉన్నాయి.

# పీపా 100 డాలర్ల పైకి..

## పశ్చిమాసియా యుద్ధ కల్లోలం... అంతర్జాతీయంగా క్రూడ్ 30% పైగా జంప్

## దేశీయంగాను రికార్డు స్థాయికి అప్.. ఫ్యూచర్స్ మార్కెట్లో రూ. 10,549కి ఎగసిన ధర




న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో సంక్షోభం తీవ్రమయ్యే కొద్దీ ముడిచమురు రేట్లు మరింతగా మండుతున్నాయి. అంతర్జాతీయంగా ఫ్యూచర్స్ మార్కెట్లో 2022 తర్వాత తొలిసారిగా బ్యారెల్ క్రూడాయిల్ ధర 100 డాలర్ల పైకి ఎగసింది. నైమెక్స్ క్రూడ్ (డబ్ల్యూటీఐ) ఏప్రిల్ డెలివరీ ధర ఒక దశలో 31.44 శాతం పెరిగి 120 డాలర్లకు దాదాపు దగ్గరగా 119.48 డాలర్లను తాకింది. అటు బ్రెంట్ క్రూడ్ కూడా 28.82 శాతం పెరిగి 119.46 డాలర్లకు ఎగసింది. హర్ముజ్ జలసంధిలో ఆయిల్ ట్యాంకర్ల రాకపోకలు తగ్గిపోవడం, ప్రాంతీయంగా పలు దేశాలు ఉత్పత్తిని తగ్గించడంతో విదేశీ మార్కెట్లలో ముడిచమురు ధరలు భారీగా పెరిగాయని ఇండస్ఇండ్ సెక్యూరిటీస్ సీనియర్ రీసెర్చ్ అనలిస్ట్ జిగర్ త్రివేది తెలిపారు. ఉద్రిక్తతల కారణంగా కీలక షిప్పింగ్ మార్గంలో నౌకలను ఇరాన్ టార్గెట్ చేసుకుంటూ ఉండటంతో గ్లోబల్‌గా దాదాపు అయిదో వంతు ముడిచమురు, సహజ వాయువు సరఫరా నిలిచిపోయినట్లు పేర్కొన్నారు. పశ్చిమాసియా పరిస్థితులను ఇన్వెస్టర్లు నిశితంగా పరిశీలిస్తూ ఉండాలని కోటక్ సెక్యూరిటీస్ కమోడిటీ, కరెన్సీ రీసెర్చ్ హెడ్ అనింద్య బెనర్జీ తెలిపారు. 'హర్ముజ్ జలసంధిలో రాకపోకలకు అంతరాయం కలిగించడం తొలి దశ. ప్రస్తుతం అదే జరుగుతోంది. రెండో దశలో మరింత తీవ్రమైన రిస్కులు ఉండొచ్చు. ప్రాంతీయంగా ఆయిల్, గ్యాస్ మౌలిక సదుపాయాలపై నేరుగా దాడులు చేయొచ్చు. మూడో దశలో కీలకమైన నీటి మౌలిక సదుపాయాలను దెబ్బతీయడం ఉండొచ్చు' అని ఆయన పేర్కొన్నారు.

**ఎంసీఎక్స్ లో భగ్గు..**

అంతర్జాతీయ పరిణామాలతో దేశీ ఫ్యూచర్స్ మార్కెట్ మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజీలో కూడా ముడిచమురు రేట్లు భగ్గుమన్నాయి. మార్చి డెలివరీ కాంట్రాక్టు ఎకాయెకిన 26 శాతం ఎగిసి (రూ. 2,186) జీవితకాల గరిష్ట స్థాయి రూ. 10,549ని తాకింది. మార్చి కాంట్రాక్టు అప్పర్ సర్క్యూట్ తాకిందని, ఒకవేళ ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే సెషన్లలో రూ. 11,300కి కూడా పెరిగే అవకాశం ఉందని చాయిస్ బ్రోకింగ్ కమోడిటీ అండ్ కరెన్సీ అనలిస్ట్ ఆమిర్ మక్డా చెప్పారు. బ్యారెల్ ధర ఒక డాలరు పెరిగితే ఏటా భారత్‌పై 1.8 బిలియన్ డాలర్ల భారం యాక్సిస్ బ్యాంక్ చీఫ్ ఎకానమిస్ట్ నీలకంఠ మిశ్రా తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయిల్ రేటు 50 డాలర్లు పెరిగి, ఏడాది పాటు కొనసాగితే 90 బిలియన్ డాలర్ల ప్రభావం ఉంటుందని, ఇది స్థూల దేశీయోత్పత్తిలో రెండు శాతమని మిశ్రా పేర్కొన్నారు.

**సంక్షోభాలు.. యుద్ధాలతో ఆజ్యం..**

సుమారు దశాబ్దంన్నర కాలంగా వివిధ సంక్షోభాలు, యుద్ధాలతో ముడిచమురు మంటలు ఎగిసిపడుతూనే ఉన్నాయి. 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభ సమయంలో కమోడిటీల బూమ్ ఏర్పడింది. ఆయిల్ ధరలు ఆ ఏడాది జూలై 11న ఆల్‌టైం గరిష్టస్థాయి 147.50కి ఎగిశాయి. ఆ తర్వాత 2011లో పశ్చిమాసియా, ఉత్తర ఆఫ్రికా దేశాలు తిరుగుబాట్లతో దద్దరిల్లినప్పుడు 127 డాలర్ల స్థాయిని చూశాయి. అమెరికన్ షేల్ ఆయిల్, గ్యాస్ మార్కెట్లను ముంచెత్తడంతో 2015 తొలినాళ్లలో 50 డాలర్లకు పడిపోయాయి. ఆ తర్వాత 2020 కోవిడ్ మహమ్మారి సమయంలో ఇంధనానికి డిమాండ్ పడిపోయి, చమురు ఉత్పత్తి దేశాలు నిల్వలను వదిలించుకునే ప్రయత్నాలు చేసినప్పుడు బ్రెంట్ క్రూడ్ రికార్డు కనిష్టం 15.98 డాలర్లకు కూడా పతనమైంది. నైమెక్స్ ఫ్యూచర్స్ మైనస్ 40.32 డాలర్లను తాకింది. మళ్లీ 2022 రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో ఆయిల్ రేట్లకు రెక్కలొచ్చాయి. 2022 తొలినాళ్లలో 139 డాలర్లకు ఎగబాకాయి.

### రూపాయి రికార్డు కనిష్టం

## 39 పైసలు తగ్గి 92.21కు...

చమురు ధరల పెరుగుదలతో దిగుమతుల బిల్లు పెరగనుంది. ఇందుకు డాలర్లలో చెల్లింపుల కారణంగా రూపాయి విలువకు చిల్లు పడింది. వెరసి డాలరుతో మారకంలో దేశీ కరెన్సీ 39 పైసలు క్షీణించి సరికొత్త కనిష్టం 92.21 వద్ద ముగిసింది. పశ్చిమాసియాలో యుద్ధ భయాలు, ప్రధాన కరెన్సీలతో మారకంలో పుంజుకున్న డాలరు దేశీయంగా రూపాయిని దెబ్బ తీసినట్లు ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి. రూపాయి ఒక దశలో 92.35కు చేరింది. ఇది ఇంట్రాడేలో రికార్డ్ కనిష్టం. కాగా.. ఆరు ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు ఇండెక్స్ 0.3% బలపడి 99.27కు చేరింది.

# ఓపెన్‌ఏఐ రోబోటిక్స్ హెడ్ రాజీనామా: కారణం ఇదే!

ప్రముఖ ఏఐ దిగ్గజం ఓపెన్‌ఏఐలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కంపెనీలో రోబోటిక్స్ విభాగానికి నాయకత్వం వహిస్తున్న కైట్లిన్ కలినోవ్‌స్కీ తన పదవికి రాజీనామా చేసారు. కైట్లిన్ కలినోవ్‌స్కీ కంపెనీ నుంచి వైదొలగడానికి ప్రధాన కారణం ఓపెన్‌ఏఐ అమెరికా రక్షణ శాఖతో చేసుకున్న కొత్త ఒప్పందం అని తెలుస్తోంది. ఈ ఒప్పందం ప్రకారం సంస్థ రూపొందించిన ఏఐ మోడళ్లను అమెరికా సైన్యానికి చెందిన రహస్య నెట్‌వర్క్‌లలో ఉపయోగించడానికి అనుమతిస్తారు. కైలిన్ కలినోవ్‌స్కీ తన సోషల్ మీడియా పోస్టులో ఈ నిర్ణయం తేలికగా తీసుకోలేదని పేర్కొన్నారు. తన అభిప్రాయం ప్రకారం జాతీయ భద్రతలో AIకి ముఖ్యమైన పాత్ర ఉన్నప్పటికీ, కొన్ని అంశాలు చాలా జాగ్రత్తగా చర్చించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా అమెరికా ప్రజలపై న్యాయపరమైన అనుమతి లేకుండా నిఘా పెట్టడం లేదా మానవ నియంత్రణ లేకుండా స్వతంత్రంగా పనిచేసే ప్రాణాంతక ఆయుధాల అభివృద్ధి వంటి అంశాలు తగిన చర్చ లేకుండా ముందుకు వెళ్లడం సరైంది కాదని వెల్లడించారు. కైట్లిన్ కలినోవ్‌స్కీ కంపెనీ నుంచి వైదొలగడానికి ప్రధాన కారణం ఓపెన్‌ఏఐ అమెరికా రక్షణ శాఖతో చేసుకున్న కొత్త ఒప్పందం అని తెలుస్తోంది. ఈ ఒప్పందం ప్రకారం సంస్థ రూపొందించిన ఏఐ మోడళ్లను అమెరికా సైన్యానికి చెందిన రహస్య నెట్‌వర్క్‌లలో ఉపయోగించడానికి అనుమతిస్తారు. కైలిన్ కలినోవ్‌స్కీ తన సోషల్ మీడియా పోస్టులో ఈ నిర్ణయం తేలికగా తీసుకోలేదని పేర్కొన్నారు.




# ప్రస్తుతానికి పెట్రోల్ రేట్లు పెరగవు



**న్యూఢిల్లీ:** ముడిచమురు ధరలు భారీగా పెరిగినప్పటికీ దేశీయంగా ప్రస్తుతానికైతే పెట్రోల్, డీజిల్ ధరలను పెంచే యోచనేదీ కేంద్రానికి లేదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇప్పటికైతే ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలే అదనపు భారాన్ని భరించనున్నట్లు వివరించాయి. మరోవైపు, వంటగ్యాస్ సిలిండర్ బుకింగ్ విషయంలో కనీస వెయిటింగ్ పీరియడ్‌ను 21 రోజుల నుంచి 25 రోజులకు పెంచినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. మార్కెట్లో కృత్రిమ కొరత ఏర్పడకుండా, అక్రమంగా నిల్వ చేయడాన్ని అడ్డుకోవడానికే ఈ చర్య తీసుకున్నట్లు పేర్కొన్నాయి. ఆయిల్ కంపెనీల వద్ద తగినంత నిల్వలు ఉన్నాయని తెలిపాయి.



# ప్రొటోకాల్ ఉల్లంఘనపై ఆగ్రహం

**న్యూఢిల్లీ / కోల్‌కతా:** రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పర్యటన సందర్భంగా పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ప్రొటోకాల్ నిబంధనలు ఉల్లంఘించడాన్ని కేంద్రం తీవ్రంగా పరిగణించింది. రాష్ట్రపతి పాల్గొనాల్సిన సంతాల్ గిరిజన సదస్సు వేదికను, ఆమె ప్రయాణ మార్గాన్ని హఠాత్తుగా మార్చడాన్ని తప్పుపట్టింది. దీనిపై వివరణ ఇవ్వాలని బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాష్ట్రపతి ప్రొటోకాల్‌కు సంబంధించిన 'బ్లూ బుక్' నిబంధనలు ఎందుకు పాటించలేదో చెప్పాలంటూ బెంగాల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కేంద్ర హోం శాఖ కార్యదర్శి లేఖ రాశారు. ''సీఎం, మంత్రులు, సీఎస్, డీజీపీల్లో ఎవరూ రాష్ట్రపతికి స్వాగతం పలక్కపోవడం బ్లూ బుక్ రూల్స్‌కు విరుద్ధం. రాష్ట్రపతికి కేటాయించిన వాష్ రూమ్‌లో నీటి సౌకర్యం కూడా లేదు. ఆమె ప్రయాణానికి చెత్తాచెదారంతో నిండిన మార్గాన్ని ఎంపిక చేశారు. వీటిపై వివరణ ఇవ్వండి. ప్రొటోకాల్ ఉల్లంఘనకు బాధ్యులైన డార్జిలింగ్ జిల్లా మేజిస్ట్రేట్, సిలిగురి పోలీసు కమిషనర్, అదనపు జిల్లా మేజిస్ట్రేట్‌పై ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పండి'' అని ఆదేశించారు. బెంగాల్ పర్యటనకు వెళ్లిన ముర్ముకు శనివారం సీఎం మమతా బెనర్జీ గానీ, మంత్రులు గానీ స్వాగతం పలకలేదు. షెడ్యూల్ ప్రకారం బదాన్‌నగర్‌లో జరగాల్సిన దళిత సదస్సును చివరి నిమిషంలో బాగ్‌డోగ్రా ఎయిర్‌పోర్టు సమీపంలోకి మార్చేశారు. సరైన సమాచారం లేక జనం ఆశించినంతగా హాజరు కాలేదు. ఈ పరిణామాలపై ముర్ము తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు.

**ప్రొటోకాల్‌ను ఉల్లంఘించలేదు: మమత**

రాష్ట్రపతి పర్యటనలో ప్రొటోకాల్ ఉల్లంఘన జరగలేదని మమత తేల్చిచెప్పారు. రాష్ట్రపతి సదస్సులో లోపాలుంటే ప్రైవేట్ నిర్వాహకులు, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియానే బాధ్యత వహించాలన్నారు. ''రాజ్యాంగం పట్ల, రాష్ట్రపతి పట్ల మాకు ఎనలేని గౌరవముంది. రాష్ట్రపతిని మా తల్లిగా భావిస్తాం. ముర్మును మేం అవమానించలేదు. ఆమెకు సిలిగురి మేయర్ స్వాగతం పలికారు'' అని చెప్పారు. ''రాష్ట్రపతిని అవమానించే అలవాటు బీజేపీదే. గతంలో ఒక సభలో రాష్ట్రపతి నుంచుని ఉంటే ప్రధాని మోదీ మాత్రం కుర్చీలో కూర్చున్నారు'' అని మమత విమర్శించారు. బీజేపీ అగ్ర నేత ఎల్‌కే అద్వానీతో పాటు మోదీ కూర్చుని ఉండగా వారి పక్కన ముర్ము నుంచున్న ఫొటోను ప్రదర్శించారు.

# మోదీ ఒక్క ఫోన్ చేస్తే యుద్ధం మొత్తం..



**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ ఒక్క ఫోన్ కాల్ చేస్తే ఇజ్రాయెల్‌ఇరాన్ ఇష్యూ మొత్తం ముగియవచ్చని భారత్‌లోని యూఏఈ తొలి రాయబారి హుస్సేన్ హసన్ మిర్జా అన్నారు. ఇవాళ ఓ ఇంటర్వ్యూలో మిర్జా మాట్లాడారు. యూఏఈకి ప్రధాని నరేంద్ర మోదీతో ఉన్న సంబంధాల గురించి ప్రశ్నించగా.. మోదీ అంటే గల్ఫ్ నాయకులకు మాత్రమే కాదని,. ఆయా దేశాల ప్రజలు, వ్యాపార వర్గాల్లో కూడా ఆయనకు చాలా గౌరవం ఉందని మిర్జా చెప్పారు. "ఇరాన్, ఇజ్రాయెల్ అధినేతలకు మోదీ ఒక్క ఫోన్ కాల్ చేస్తే ఈ సమస్య పరిష్కారం అవుతుంది. ఈ సమస్య ముగుస్తుంది. ఒక ఫోన్ కాల్ చాలు" అని మిర్జా చెప్పారు. ప్రస్తుతం యుద్ధం చేస్తున్న ఇరాన్ ఇజ్రాయెల్ నాయకులతో మోదీకి ఉన్న సత్సంబంధాలపై ఇది ఆధారపడి ఉందని ఆయన చెప్పారు. 'ఇజ్రాయెల్‌ఇరాన్ ఘర్షణలో చేరాలనే ఆసక్తి యూఏఈకి లేదు. మా భూభాగాన్ని దాడుల కోసం వాడుకోవడానికి ఇరు పక్షాలకు అనుమతి ఇవ్వము. నిజంగా చెప్పాలంటే ఇందులో మేమెందుకు చేరుతున్నామో నాకు స్పష్టంగా తెలియదు. ఈ ఘర్షణలో యూఏఈ జోక్యం చేసుకోవాల్సిన కారణం ఏమీ లేదు" అని మిర్జా వ్యాఖ్యానించారు. రెండు పక్షాలతో తాము చర్చలు జరపగలమని అన్నారు. యూఏఈ సున్నితమైన భౌగోళికరాజకీయ పరిస్థితుల్లో ఉంది. అది ఇరాన్ పక్కన ఉన్న దేశం. అలాగే అబ్రహామ్ ఒప్పందాల కింద ఇజ్రాయెల్‌తో యూఏఈ పార్ట్‌నర్‌షిప్ కొనసాగిస్తోంది. అబ్రహామ్ ఒప్పందాలు అంటే కొన్ని అరబ్ దేశాలు ఇజ్రాయెల్‌తో సంబంధాలు సాధారణం చేసుకోవడానికి కుదుర్చుకున్న అంతర్జాతీయ ఒప్పందాలు. "వాళ్లు మా భూభాగంగాపై పరస్పరం యుద్ధం చేస్తున్నారు. దీన్ని మేము అంగీకరించలేం" అని మిర్జా చెప్పారు. ఇప్పటివరకైతే నష్టం తక్కువగానే ఉన్నట్టు తెలుస్తోందని అన్నారు. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా మొజ్తబా ఖమేనీ బాధ్యతలు చేపట్టారు. సోమవారం ఇజ్రాయెల్ సైన్యం ఇరాన్‌పై మరోసారి దాడులు చేసింది. బీరూట్‌లో హిజ్బుల్లా మౌలిక సదుపాయాలపై కూడా దాడి చేసింది. ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ రాయబారి చెప్పిన వివరాల ప్రకారం యుద్ధంగా వల్ల ఇప్పటివరకు ఇరాన్‌లో 1,332 మంది సాధారణ ప్రజలు మృతి చెందారు. వేలాది మంది గాయపడ్డారు.

# ఏపీ రైతులపై అత్యధిక అప్పుల భారం




ఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ రైతులు దేశంలోనే అత్యధిక అప్పుల భారాన్ని మోస్తున్నారు. 2025, డిసెంబర్ 31 నాటికి ఏపీలో రైతన్నల నెత్తిన 3,75,254 కోట్ల రూపాయల అప్పుల భారం పడింది. ఈ పరిస్థితిని కేంద్ర వ్యవసాయశాఖ పార్లమెంట్‌లో అధికారికంగా వెల్లడించింది. లోక్ సభలో లిఖిత పూర్వక ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సమాధానం ఇచ్చారు. రైతుల పై 2,01,744 కోట్ల రూపాయల పంట రుణాల భారం ఉండగా, టర్మ్ లోన్ భారం 1,73,510 కోట్ల రూపాయలగా ఉంది. మొత్తం కలిపి రైతులపై 3,75,254 కోట్ల రూపాయల రుణ భారంగా మారింది. దేశంలో తమిళనాడు తర్వాత రుణభారం లో తల్లడిల్లుతున్నారు ఏపీ రైతులు. ఫలితంగా దేశంలోనే రైతుల రుణభారంలో రెండో స్థానంలో ఏపీ ఉంది. చంద్రబాబు నాయుడు పరిపాలనలో రైతులకు ఆదరణ కరువు అన్న దానికి ఇది సంకేతంగా నిలుస్తుంది. అరకొరగా రైతులకు వాగ్దానాలు అమలు చేస్తుండటంతో ఏపీ రైతులపై అప్పుల భారం తడిపి మోపడైంది. ఇక పక్క రాష్ట్రం తెలంగాణలో రైతులపై 1,75,960 కోట్ల రూపాయల అప్పుల భారం ఉంది. తెలంగాణలో రైతులపై క్రాప్ లోన్ 95,167 కోట్లు రూపాయలు, 80,792 కోట్ల రూపాయల టర్మ్ లోన్ గా ఉంది.

# గల్ఫ్ దేశాల నుంచి 52 వేల మంది తరలింపు

గల్ఫ్ దేశాల నుంచి 52 వేల మంది తరలింపు



**న్యూఢిల్లీ:** పశ్చిమాసియా సంక్షోభం తలెత్తిన తర్వాత మార్చి ఒకటో తేదీ నుంచి 52 వేల మందికి పైగా భారతీయులు స్వదేశానికి చేరుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. పర్యాటకులుగా వెళ్లిన వీరంతా ఆయా దేశాల్లో చిక్కుకున్నారని తెలిపింది. మరింత మందిని తీసుకువచ్చేందుకు ప్రణాళికలను సిద్ధం చేశామంది. పశ్చిమాసియా దేశాల్లో ఉంటున్న కోటి మందికి పైగా భారతీయుల భద్రత కోసం పలు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించింది. ఆ ప్రాంతంలో వేగంగా మారుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నట్లు వెల్లడించింది. పశ్చిమాసియా దేశాల్లో పాక్షికంగా గగనతలాలను తెరవడంతో దేశీయ, విదేశీ విమానయాన సంస్థలు నడిపే కమర్షియల్, నాన్ షెడ్యూల్డ్ విమానాల ద్వారా మన వాళ్లను తరలిస్తున్నామంది. మార్చి 1-7వ తేదీల మధ్య 52 వేల మందిని సురక్షితంగా తీసుకొచ్చినట్లు కేంద్రం వివరించింది. వీరిలో 32,107 మంది దేశీయ విమానయాన సంస్థలు తీసుకు వచ్చాయని పేర్కొంది. కమర్షియల్ విమానాల అందుబాటుకు సంబంధించిన సూచనలు, సలహాలను దగ్గర్లోని భారత దౌత్య కార్యాలయాలు, కాన్సులేట్ల నుంచి తెలుసుకోవచ్చంది. 24 గంటలూ పనిచేసే హెల్ప్‌లైన్ల ద్వారా కూడా సంప్రదించవచ్చని కేంద్రం వివరించింది.



## ధురంధర్ 2 తర్వాత ఆ సినిమా చేయనున్న సారా?

ఒకప్పుడు చైల్డ్ ఆర్టిస్ట్‌గా అలరించిన సారా అర్జున్ ఇప్పుడు హీరోయిన్‌గా అదరగొడుతోంది. తను కథానాయికగా నటించిన తొలి చిత్రం ధురంధర్ బాక్సాఫీస్ వద్ద ఎంతటి సంచలనాలు సృష్టించిందో అందరికీ తెలిసిందే! అనంతరం యుఫోరియా చిత్రంతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది. ప్రస్తుతం ధురంధర్ 2తో ముందుకు రాబోతోంది.

### రూమర్స్ పై క్లారిటీ

అయితే ఈ 20 ఏళ్ల బ్యూటీ "హీర్ రాంఝా" (పంజాబీ జానపద విషాద కథ) అనే మూవీ చేస్తున్నట్లు బీటౌన్‌లో ప్రచారం జరుగుతోంది. ఏక్తా కపూర్ నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్‌లో సారా.. హీర్ పాత్రలో నటించనుందని సదరు వార్తల సారాంశం. ఈ రూమర్స్‌పై కాస్టింగ్ డైరెక్టర్ ముకేశ్ చాబ్రా స్పందించాడు. సారా అర్జున్ ఏ సినిమాకి సంతకం చేయలేదు. నెక్స్ట్ ప్రాజెక్ట్ గురించి ఎవరితోనూ చర్చలు జరపలేదు, ఎవర్నీ కలవలేదు.

### నేనే చెప్తా..

ప్రస్తుతం మేమంతా ధురంధర్ 2 కోసం ఎదురుచూస్తున్నాం. కాబట్టి అందరూ ప్రశాంతంగా ఉండండి. తను నెక్స్ట్ ఏదైనా సినిమా ఒప్పుకుంటే నేనే స్వయంగా మీకు వెల్లడిస్తాను. అప్పటివరకు వచ్చే ఏ వార్తనూ మీరు నమ్మకండి అని ఎక్స్ (ట్విటర్)లో రాసుకొచ్చాడు. అంటే ధురంధర్ 2 తర్వాతే సారా తన నెక్స్ట్ సినిమాపై దృష్టి సారించనున్నట్లు తెలుస్తోంది.

### సినిమా

ధురంధర్ విషయానికి వస్తే.. ఆదిత్య ధర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటించాడు. గతేడాది చివర్లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాకు సీక్వెల్‌గా ధురంధర్ 2 వస్తోంది. అర్జున్ రాంపాల్, సంజయ్ దత్, ఆర్.మాధవన్, రాకేశ్ బేడీ, సారా అర్జున్ కీలక పాత్రలు పోషించిన ఈ మూవీ మార్చి 19న పాన్ ఇండియావైడ్‌గా విడుదల కానుంది.

## సల్మాన్‌ఖాన్‌కి జోడీగా?

దక్షిణాదిన అగ్రస్థానంలో ఉన్న కథానాయిక ఎవరంటే.. 'నయనతార' అని టక్కున చెప్పేస్తారు. పారితోషికం పరంగా కూడా నయనే నంబర్ వన్. ప్రస్తుతం ఆ భాష, ఈ భాష అని లేకుండా, అన్ని భాషల్లోనూ సినిమాలు చేస్తూ సత్తా చాటుతున్నది నయనతార. మెగాస్టార్‌తో ఆమె రీసెంట్ హిట్ 'మన శంకర వరప్రసాద్‌గారు' టాలీవుడ్ రీజనల్ సినిమాల్లో నంబర్‌వన్ హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం బాలకృష్ణ 'NBK 111'లో కథానాయికగా నటిస్తున్నది నయనతార. ఇక తమిళంలో అయితే.. ఆమె చేతిలో చాలా సినిమాలున్నాయి.ఇదిలావుంటే.. రీసెంట్‌గా ఓ బాలీవుడ్ సినిమాకు నయన్ సైన్ చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్‌ఖాన్ హీరోగా రూపొందనున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి టాలీవుడ్ డైరెక్టర్ పైడిపల్లి వంశీ దర్శకుడు. దిల్‌రాజు నిర్మిస్తారట. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే రానున్నది. ఇక నయన్ నటించిన తమిళ చిత్రం 'ముక్తీ అమ్మన్' సమ్మర్‌లో విడుదలకానుంది.



# రికార్డుల దురంధర్..



రణ్‌వీర్ సింగ్ హీరోగా వచ్చిన స్పై యాక్షన్ థ్రిల్లర్ దురంధర్. పాకిస్తాన్ నేపథ్యంలో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. గతేడాది డిసెంబర్ 5న రిలీజైన ఈ సినిమా ఏకంగా రూ.1300 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఈ సినిమాకు ఆదిత్య ధర్ దర్శకత్వం వహించారు. కేవలం హిందీలోనే రిలీజైనప్పటికీ బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టించింది.అయితే కొన్ని నెలల వ్యవధిలోనే ఈ మూవీకి సీక్వెల్‌గా దురంధర్ ది రివెంజ్ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఇటీవల ట్రైలర్ రిలీజ్ చేయగా.. అంచనాలు మరింత పెంచేసింది. తాజాగా ఈ మూవీకి సంబంధించి ఓటీటీ స్ట్రీమింగ్ ఫ్లాట్‌ఫామ్ ఖరారైంది. ఈ చిత్రం థియేట్రికల్ రిలీజ్ తర్వాత జియో హాట్‌స్టార్ వేదికగా అందుబాటులోకి రానుంది. ఈ విషయాన్ని ట్రైలర్‌లోనే వెల్లడించారు. థియేటర్లలో రిలీజైన తర్వాత ఈ మూవీ స్ట్రీమింగ్ తేదీని మేకర్స్ ప్రకటించనున్నారు. కాగా.. ధురంధర్: ది రివెంజ్ మార్చి 19న థియేటర్లలో విడుదల కానుంది.

### పోటీ నుంచి తప్పుకున్న టాక్సిక్..

ఈ మూవీతో మార్చి 19న యశ్ హీరోగా వస్తోన్న టాక్సిస్ రిలీజ్ కావాల్సి ఉంది. అయితే బాక్సాఫీస్ పోటీ నుంచి యశ్ తప్పుకున్నారు. గీతు మోహన్‌దాస్ దర్శకత్వం వహించిన గ్యాంగ్‌స్టర్ మూవీ జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది.

### అడ్వాన్స్ బుకింగ్స్ లో దురంధర్-2 ప్రభంజనం.. ఎన్ని కోట్లంటే?

రణ్‌వీర్ సింగ్ హీరోగా వచ్చిన స్పై యాక్షన్ థ్రిల్లర్ దురంధర్. పాకిస్తాన్ నేపథ్యంలో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. గతేడాది డిసెంబర్ 5న రిలీజైన ఈ సినిమా ఏకంగా రూ.1300 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఈ సినిమాకు ఆదిత్య ధర్ దర్శకత్వం వహించారు. అయితే కొన్ని నెలల వ్యవధిలోనే ఈ మూవీకి సీక్వెల్‌గా దురంధర్ ది రివెంజ్ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఇటీవల ట్రైలర్ రిలీజ్ చేయగా.. అంచనాలు మరింత పెంచేసింది. తాజాగా ఈ మూవీకి సంబంధించిన ప్రీ టికెట్ బుకింగ్స్ ఓపెన్ చేయగా.. సరికొత్త రికార్డులతో దూసుకెళ్తోంది. కేవలం రెండు రోజుల్లో రెండు లక్షలకు పైగా టిక్కెట్లు అమ్ముడు కావడం చూస్తుంటే ఏ రేంజ్‌లో క్రేజ్ ఉందో అర్థమవుతోంది. అడ్వాన్స్ టికెట్స్ బుకింగ్స్ ద్వారా ఇప్పటికే రూ. 18.11 కోట్ల గ్రాస్ వసూలు చేసిందని ట్రేడ్ వెబ్‌సైట్ సాక్నిల్క్ తెలిపింది. ఈనెల 19న దురంధర్ ది రివెంజ్ థియేటర్లలోనే సందడి చేయనుంది. అంతకుముందు రోజే ఈ సినిమా ప్రీమియర్ షోలను ప్రదర్శించనున్నారు. ఈ షోల కోసం మేకర్స్ ముందుగానే బుకింగ్‌లు ప్రారంభించడంతో చాలా థియేటర్లలో టిక్కెట్లు హాట్‌కేకుల్లా అమ్ముడవుతున్నాయి. హిందీలో మొదటి రోజే టికెట్ ధర ప్రస్తుతం రూ. 450500 మధ్య ఉంది. ఈ మూవీ రిలీజ్‌కు ముందే రికార్డులు సృష్టిస్తోంది. ఈ చిత్రం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో కూడా విడుదల కానుంది.

### 'ధురంధర్' మేకర్స్ కు తెలుగు ప్రేక్షకుల రిక్వెస్ట్

బాలీవుడ్ మూవీ 'ధురంధర్: ది రెవెంజ్' తెలుగు ట్రైలర్ తాజాగా విడుదలైన విషయం తెలిసిందే. ఈ సందర్భంలో తెలుగు ప్రేక్షకులు ఒక రిక్వెస్ట్ చేస్తున్నారు. బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ హీరోగా ఆదిత్య ధర్ దర్శకత్వంలో గతేడాది వచ్చిన చిత్రం 'ధురంధర్'. ఇప్పుడు ఈ మూవీకి సీక్వెల్‌గా పార్ట్ 2 రానుంది. దేశభక్తి కాన్సెప్ట్‌తో భారీ స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా హిందీలో మాత్రమే విడుదలైన ఈ మూవీ పాన్ ఇండియా రేంజ్‌లో ప్రేక్షకులను మెప్పించింది. దీనిని దృష్టిలో పెట్టుకుని ఇప్పుడీ చిత్రానికి సీక్వెల్ రూపొందించారు. హిందీతో పాటు తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళంలో మార్చి 19న విడుదల చేస్తున్నారు. తెలుగు ట్రైలర్ విడుదల తర్వాత టాలీవుడ్ ప్రేక్షకుల నుంచి దర్శకుడికి ఒక విన్నపం అంటూ వైరల్ అవుతుంది. ధురంధర్ 2 నిర్మాతలు తెలుగు ట్రైలర్‌ను ఆవిష్కరించిన తర్వాత డబ్బింగ్, సంభాషణల పట్ల తెలుగు ప్రేక్షకుల నుండి సానుకూల స్పందన వచ్చింది. తెలుగు డబ్బింగ్ పనులను హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్ నిర్వహించినట్లు సమాచారం. అయితే, తెలుగు ప్రేక్షకులకు నుంచి దర్శకుడు ఆదిత్య ధర్‌కు ఒక స్పష్టమైన అభ్యర్థన వైరల్ అవుతుంది. ఈ చిత్రాన్ని పాన్‌ఇండియ రేంజ్‌లో విడుదల చేస్తున్నందున, అభిమానులు పాటలను తెలుగులోకి డబ్ చేయకుండా వాటి అసలు హిందీ వెర్షన్‌లోనే ఉంచమని మేకర్‌స్‌ను అడుగుతున్నారు. ఈ అభ్యర్థన వెనుక కారణం గతంలో అనేక డబ్ చేసిన సినిమా పాటలు ప్రేక్షకులను పెద్దగా మెప్పించలేదు. అనువాదంలో విడుదలైన పాటలు బలహీనమైన మిక్సింగ్‌తో పాటు తప్పుడు అర్థాలు రావడం గమనించారు. డబ్ చేసిన వెర్షన్‌లలో వచ్చే పాటలు సినిమా ప్రభావాన్ని తగ్గిస్తాయని చెబుతున్నారు. దీని కారణంగా, పాటలు హిందీలోనే ఉంచాలని తెలుగు ప్రేక్షకులు కోరుతున్నారు. మూవీలో డైలాగ్‌లను మాత్రమే తెలుగులోకి డబ్ చేస్తే మంచిదని చాలామంది భావిస్తున్నారు. నిర్మాతలు ఈ అభ్యర్థనను పరిశీలిస్తారా లేదా తెలుగుడబ్ చేసిన పాటలతో ముందుకు వెళ్తారా అనేది ఇంకా తెలియాల్సి ఉంది. ఈ సినిమాని ఆదిత్య, జ్యోతీదేశ్ పాండే, లోకేశ్ ధర్‌తో కలిసి సంయుక్తంగా నిర్మించారు.



## అలియా భట్ 'ఆల్ఫా'కు మరోసారి బ్రేక్

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియా భట్, శార్వరీ వాఘ్‌లు నటిస్తున్న కొత్త చిత్రం 'ఆల్ఫా'. మరోసారి వాయిదా పడింది. ఈ విషయాన్ని తాజాగా చిత్ర నిర్మాణ సంస్థ యశ్‌రాజ్ ఫిల్మ్ ప్రకటించింది. మొదట క్రిస్మస్-2025లో విడుదల చేస్తామని మేకర్స్ ప్రకటించారు. పలు కారణాల వల్ల వాయిదా వేస్తున్నామని ఫిబ్రవరి 20 అని ఒకసారి ఏప్రిల్-2026 అని మరోసారి పేర్కొన్నారు. అయితే, తాజాగా మళ్లీ వాయిదా వేస్తున్నట్లు చెప్పడంతో ఫ్యాన్స్‌కు నిరాశ ఎదురైంది. దర్శకుడు శివ్ రావేల్ ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. ఆల్ఫా సినిమా జులై 10న విడుదల చేస్తున్నట్లు యశ్‌రాజ్ ఫిల్మ్ తాజాగా ఒక పోస్టర్ విడుదల చేసింది. స్పై యూనివర్స్‌లో రాబోతున్న మొదటి మహిళా గూఢచారి చిత్రం కావడంతో సినీ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. గతంలో ఎన్నడూ చూడని భారీ యాక్షన్ సీన్స్ ఈ చిత్రంలో ఉంటాయని మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ఇందులో అనిల్‌కపూర్, బాబీ డియోల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అయితే.., బాబీ డియోల్, అలియాలకు మధ్య భారీ యాక్షన్ సీన్స్ అదిరిపోతాయని అంటున్నారు. హాలీవుడ్ యాక్షన్ కొరియోగ్రాఫర్‌ల సమక్షంలో యుద్ధపోరాట సన్నివేశాలను చిత్రీకరించినట్లు సమాచారం. అలియాకు గురువుగా బాలీవుడ్ స్టార్ నటుడు హృతిక్ రోషన్ కనిపిస్తారని టాక్.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com